తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

సెప్టెంబర్-2024

వెల: ₹20



తానే ఓ సిద్ధాంత గ్రంథం-తనికెళ్ళ భరణి

ముళ్ళపూడివారి కథలకు కేరాఫ్ అడ్రస్- అక్షజ్ఞ

## నవ్వేందుకు ఈ ఫీట్లు... పాట్లు మీకెందుకు చెప్పండి?...

## హాస్యానందం చందాదారులుగా చేరండి!

## నవ్వే లక్షణం మీ సొంతం చేసుకోండి!



గత ఇరవై రెండు సంవత్సరాలుగా
ఇంటిల్లిపాదినీ నవ్వించే పని పెట్టుకున్న
ఏకైక తెలుగు హాస్య మాస పత్రిక

**హాస్యానందం**

**సంవత్సర చందా- రూ.300/-**
**2 సంవత్సరాల చందా- రూ.500/-**
**జీవిత చందా- రూ.5000/-**
(జీవిత చందాదారులకు పత్రిక
రిజిష్టర్ పోస్ట్‌లో పంపబడుతుంది)

**మీ చందాని 9849630637 నెంబరుకు Google Pay Or PhonePe చేయండి!**

**HASYANANDAM**
#8-215/4, near Ramalayam Centre, YERRABALEM. Mangalagiri 522 503. Guntur Dt.
Ph: 9849630637.
email: hasyanandam.mag@gmail.com

Smile in every page
Satisfaction in every smile

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక | జీ'వనం'లో నవ్వు నవ వసంతం

# హాస్యానందం

సెప్టెంబర్-2024 | 21వ సంవత్సరం 243 వ సంచిక

ముఖచిత్రం: హాస్యరసాధిపతి గణపతి

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**
email: **hasyanandam.mag@gmail.com**
web: **www. hasyanandam.com**

*Full Pillar* : Bnim
*Cartoon Feature Editor*: Bachi

*Creative Team*
Dr. K.Ramakrishna,
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar,
Dayakar, Gandhi, Nagisetty, Bomman
GopalKrishna, Sangram, Krishna

*D.T.P:* P. Ramalakshmi, 9440304993
*Digital Media Director:* Surya

*Publisher& Editor-*
*Ramu. P*

*Well Wishers:*
Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Gudibandi Venkata Reddy
Dr.V.V.Rama Kumar

*Prize Sponsers*
K.V.V.Satyanarayana,
*Cartonist* JSR
K.Sundaresayya &
Satyavathi
Md.Raj Mohammed
Nimmi Madhubala
Mallika, Lakshmi
P. Srikantha Sarma

| సంవత్సర చందా-రూ.300/- (పోస్టల్ చార్జీలతో) | 2 సంవత్సరాల చందా-రూ.500/- (పోస్టల్ చార్జీలతో) |
|---|---|

**జీవిత చందా- రూ.5000/-లు**

Gpay *or* Ppay # **9849630637**

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad. Cell. 9666680857.




**Smile in Every Page...Satisfaction in Every Smile**

# ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...

## కథలు


| | | |
|---|---|---|
| గోరింటాకు | -పసుపులేటి సుధారాణి | -20 |
| కలకానిది... విలువైనది... | -విశాలి(కొత్తూరి)పేరి | -30 |
| వ్యసనం కథ | -పద్మ పైడిమర్రి | -32 |
| పుట్టు వెంట్రుకలు -పులిగోరు | -వేలూరి ప్రమీలాశర్మ | -34 |
| (అ)ప్రశాంత రావు | -కంచనపల్లి ద్వారకనాథ్ | -40 |
| ఆల్ ఈస్ వెల్ | -కె.వి.సుమలత | -42 |
| నా సబ్బు రహస్యం | -డా. బెల్లంకొండ నాగేశ్వరరావు | -48 |


## స్పెషల్స్


| | |
|---|---|
| తానే ఓ సిద్ధాంత గ్రంథం! | -7 |
| బాచి అవార్డు -2024 పురస్కారం మరియు శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక కార్టూన్ల పోటీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం! | -13 |
| 'బెస్ట్ న్యూస్ పేపర్ కార్టూన్' అవార్డు గ్రహీత- శ్రీసుభాని | -23 |
| ముళ్ళపూడివారి కథలకు కేరాఫ్ అడ్రస్- అక్షజ్ఞ పబ్లికేషన్స్ | -37 |


## శీర్షికలు


| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -8 |
| తెలుగా మజాకా?! | డాక్టర్ కప్పగంతు రామకృష్ణ | -10 |
| వాక్చిత్రం | సుధామ | -19 |
| నవ్వులాట | గాంధీ మనోహర్ | -24 |
| స్మైల్ స్టార్స్ | రామ్‌శేషు | -26 |
| వెనక్కి వెళ్ళే కథలు | వడ్లమన్నాటి గంగాధర్ | -26 |
| పదానందం | పోపూరి విశ్వనాథ్ | -50 |


## సీరియల్స్


| | | |
|---|---|---|
| కొంగుచాటు కృష్ణుడు | -యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి | -14 |
| ఇందు చందు-నవ్వులవిందు | కండ్లకుంట శరత్‌చంద్ర | -44 |


## కార్టూన్ శీర్షికలు





| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -16 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -17 |
| నవ్వే ఆనందం | -సరసి | -22 |
| డబుల్ ధమాకా | -గోపాలకృష్ణ | -23 |
| చిలిపి చిలుకలు | -మురళీధర్ | -33 |
| ఈ నెల దినం | -రామ్‌శేషు | -36 |
| రిటైర్డ్ లైఫ్ | -బొమ్మన్ | -46 |












## ఈ సంచికలో కార్టూనిస్టులు

- ✦ జయదేవ్
- ✦ సరసి
- ✦ సుభాని
- ✦ శేఖర్
- ✦ సునీల్
- ✦ గోపాలకృష్ణ
- ✦ శర్మ
- ✦ రామ్‌శేషు
- ✦ దొరశ్రీ
- ✦ గాంధీ
- ✦ నాగిశెట్టి
- ✦ డేవిడ్
- ✦ ప్రసిద్ధ
- ✦ చక్రవర్తి
- ✦ ఓంకార్
- ✦ శేఖర్‌బాబు
- ✦ తోపల్లి ఆనంద్
- ✦ పద్మ
- ✦ టి.ఆర్.బాబు
- ✦ బొమ్మన్
- ✦ కాశ్యప్
- ✦ మురళీధర్
- ✦ బివిఎస్
- ✦ టి.భాస్కర్
- ✦ వర్మ
- ✦ భాను
- ✦ రావు
- ✦ శేషయ్య
- ✦ శంబంగి
- ✦ వందనశ్రీనివాస్
- ✦ శ్రీ


**గమనిక:**
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

విఘ్నాలే తొలగాలని...

విజయాలే కలగాలని...

నవ్వుల నాయకుని

విన్నవించుకుందాం!

హాస్యానందంగా ఉందాం!

హాస్యానందం అభిమానులకు...

ఆప్తులకు... హాస్యప్రియులకు,

రచయితలకు రచయిత్రులకు,

కార్టూనిస్టులకు

**వినాయక చవితి**

**శుభాకాంక్షలు**








✦ **ఆర్.కృష్ణకుమారి, చెన్నై**

**ము**ళ్ళపూడి హాస్య కథల పోటీలో గెలుపొందిన కథలతో రూపొందిన ఆగష్టు హాస్యానందం సంచిక చాలా బాగుంది... అన్ని కథలు 'ముళ్ళపూడి'గారి మార్కుని ఆవిష్కరించాయి. కథలతో పాటు బహుమతి తీసుకుంటున్న ఫొటోలు ఇవ్వటం రచయిత(త్రు)లకు మీరిచ్చే గౌరవం ప్రస్ఫుటమవుతుంది. మీ ఈ శ్రద్ధ పత్రిక మనుగడకు ఎంతో దోహదమవుతుందనేది మా నమ్మకం! ఇక బాచిగారి కార్టూన్ పోటీలో గెలుపొందిన కార్టూన్లు చాలా బావున్నాయి. ముఖ్యంగా మొదటి బహుమతి పొందిన ప్రసిద్ధ గారి కార్టూన్ సింప్లీ సూపర్బ్!

✦ **పి.వి.శ్రీనివాస్ శ్రీలేఖ, సికింద్రాబాద్**

**'హాయ్**... సానందంగా..." (ఆగస్ట్ 2024 సంచిక)లో పి. రాము గారు చక్కగా సెలవిచ్చారు. మరీ దూరంగా – మరీ దగ్గరగా కాకుండా ఉండాలి మనుషులతో అని. అది అందరికీ వర్తిస్తుంది. ఏ ఇద్దరి మనుషుల స్వభావాలు ఒకటేలా ఉండవు కాబట్టి. ఎక్కడిది అక్కడే వదిలేయాలి (ఇంకో చెవి నుండి). మంచిని మాత్రమే ఆస్వాదించాలి. అప్పుడు వైరం అనే పదం ఈ ప్రపంచ నిఘంటువు నుండి అదృశ్యం అయిపోతుంది. సమాజం స్నేహంతో బాగు పడుతుంది. ప్రేమికులు మరియు ప్రాణ–స్నేహితులు కూడా బద్ధ శత్రువుల్లా మారటం తరచూ చూస్తూంటాం. అన్ని దేశాల్లో – రాష్ట్రాల్లో విడాకుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. దీనికి పరిష్కారం? ఎవ్వరూ – ఎవరి నెత్తి కెక్కకుంటే చాలా సమస్యలు వాటికవే మాయం అయిపోతాయి. మరియు ఎప్పుడూ సంతోషపూరిత నిర్వహణ–పరిష్కారాల రూపంలో మాట్లాడాలి, ఆచరించాలి... ఇది రోజూ ప్రతి విద్యాకేంద్రం, కార్యాలయంలో చెబితే – శిక్షణగా ఇస్తే, అందరూ తెలుసుకుంటారు, స్నేహం–అభివృద్ధి–అభ్యుదయం నిండిన జీవితం పొందుతారు. సమాజం, ప్రపంచం బాగుపడుతుంది వైరాలు, శత్రుత్వాలు లేకుండా. పుస్తక పఠనం చేయాలి, కనీసం అరగంట ఉదయం, అరగంట పడుకునే ముందు రాత్రి. అదీ హాస్యానందం లాంటి ఆరోగ్యకరమైన పుస్తకం అయితే మరీ మంచిది. మస్తిష్కం–హృదయం తేలిక పడుతుంది. ఛాతీ నొప్పి, హార్ట్ ఎటాక్, బీపీలు రావు. వద్దన్నా మంచి మాటలు చేతలు వస్తాయి – పొంగుతాయి. వైరాలకు ఆస్కారం ఉండదు.

✦ **టి.వి.రాజశేఖర్, హైదరాబాద్**

**ఆ**గష్టు హాస్యానందం సంచిక చాలా బాగుంది. మీ శ్రద్ధ ప్రతి పేజీలో కనిపిస్తోంది. కథల పోటీలో గెలుపొందిన కథలు బావున్నాయి. అలానే కథల ప్రజంటేషన్ కూడా చాలా చక్కగా ఉంది. కార్టూన్ల పోటీలో గెలుపొందిన కార్టూన్లు చాలా బావున్నాయి. ఇంత మంచి పత్రిక వెలువరుస్తున్న మీకు మా అభినందనలు.

✦ **పి.వి.మధు నివ్రితి, హైదరాబాద్**

**సం**పాదకులకు – బృందానికి, అందరికీ 'హ్యాట్రిక్' –పండగ–శుభాకాంక్షలు (స్నేహితుల దినోత్సవం– రాఖీ బంధన్ –స్వాతంత్ర్య దినోత్సవం). 'చిరంజీవులకు ఆశీస్సులు' లో చిన్నారుల ఫోటోలు ఇచ్చి ప్రోత్సహించారు. వారి పవిత్ర హృదయాలను, వారి తల్లి దండ్రులను సంతోష పెట్టారు. శతకోటి ధన్యవాదాలు మన–మీ హాస్యానందం బృందానికి.

ప్రతిసారీ కార్టూన్లు కొత్తగానే కాదు... నవ్వించేలా కూడా ఉన్నాయి. హ్యాట్సాఫ్. ఉగాది పండగ లెక్చర్ దంచేసారు రామకృష్ణ గారు (తెలుగా మజాకాలో). వాక్చిత్రంలో సుధామ గారు– గి'రాఖీ' పేరులోనే వాక్చిత్రం చూపించారు. 'అక్షర స్వయంవరం' లో జనార్ధనరావు (జెన్నీ) గారు హాస్యంతో పాటే మంచి పరిష్కారం చూపించారు. కొన్ని జంటలకు. ఇలాంటి పెళ్ళిళ్ళు నిజంగా జరుగుతున్నాయి 'ఇరు–వైపులకు– వర్గాలకు మంచిదే' అన్నట్టు. రాముగారి సంపాదకీయం ఎం.బి.ఎ. పుస్తకంలో పేజీ తిరగేసినట్టు ఉంటుంది. చాలా ఉపయోగం అందరికీ.

✦ **బి.వి.గోపాలకృష్ణ, విశాఖపట్టణం**

**ప్ర**తి సంచికలో ఏదో ఒక పోటీల ప్రకటన హాస్యానందానికి ఆభరణం. ఇంతమంది హాస్యానందం వేదికగా నిర్వహిస్తున్న ఈ పోటీలు హాస్యానందంపై వారి నమ్మకంకు నిదర్శనం. ఏదో చేసేసాము అని కాకుండా విజేతలకు మీరిస్తున్న గౌరవం కూడా చాలా గొప్పగా ఉంటున్నాయి. ఉదాహరణకి ముళ్ళపూడి హాస్య కథల పోటీలో గెలుపొందిన వారి ఫొటోలు ప్రత్యేకగా ఇవ్వటం... ఇది ఏ తెలుగు పత్రికలలో నేను ఇంతకు ముందు చూడలేదు. మీ ఆలోచనకు అభినందనలు.

✦ **సిహెచ్.సులోచనారాణి, బెంగళూరు**

**ఆ**గష్టు హాస్యానందంలో ప్రచురించిన బహుమతి పొందిన కథలు చాలా బావున్నాయి. కథలకు వేసిన బొమ్మలు కూడా పేజీకి మరింత అందం సంతరింపజేసాయి. అన్ని కథలు ఒకే సంచికలో వేయటం గ్రేట్! అలాగే కార్టూన్ శీర్షికలు అన్నీ వేటికవే ప్రత్యేకంగా ఉంటున్నాయి. ఇంతమంది కార్టూనిస్టులు ఒక్క మన హాస్యానందంలోనే దర్శన మిస్తుంటారనుకుంటా! ఇలాగే పదికాలాల పాటు మన హాస్యానందం వర్ధిల్లాలని కోరుకుంటున్నాను.

✦ **వై.రాజేశ్వరరావు, నెల్లూరు**

**హా**స్యానందం మా ఇంటిల్లీపాది అభిమాన పత్రిక. ఆరోగ్యకరమైన హాస్యంతో తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య పత్రిక మన హాస్యానందం అని తల్చుకుంటుంటే గర్వంగా ఫీలౌతుంటాము. చక్కటి కథలతో, చిక్కటి కార్టూన్లతో ప్రతినెలా మా ఆనందానికి దోహదపడుతున్న మా(మీ) హాస్యానందానికి శుభాశీస్సులు. ఇలాగే నిరంతంగా ఇది నవ్వులయాత్ర కొనసాగాలని కోరుకుంటున్నాను.

# తానే ఓ సిద్ధాంత గ్రంథం!






ఒక సిద్ధాంత గ్రంథం రాసిన వారికే విశ్వవిద్యాలయం డాక్టరేట్ ఇస్తుంది... కానీ ఒక సిద్ధాంత గ్రంథం అయిన భరణిగారికి గౌరవ డాక్టరేట్ ఇచ్చింది తెలంగాణ హనుమకొండ హసన్‌పర్తి అనంతసాగర్ లోని ఎస్సార్ విశ్వవిద్యాలయం.
అసంఖ్యాక ప్రేక్షక జన, పాఠక జన హృదయాలలో అభిమాన దుర్గాన్ని కట్టుకున్న జనాభిశంకరుడు మన భరణి.
ఎనిమిది వందలకు పైగా సినిమాల్లో అలరించిన వాడే కాదు... దర్శకునిగా మిధునంతో బెస్ట్ డైలాగ్ నంది అవార్డు పొందిన ఘనాపాఠి... 'సముద్రం' చిత్రానికి ఉత్తమ విలన్‌గా నంది అవార్డు కొట్టినవాడు... 'నువ్వు నేను' చిత్రానికి క్యారెక్టర్ యాక్టర్‌గా నంది అందిపుచ్చుకోవడంలోనే భరణిలోని నటనా వైదష్య వైవిధ్యం ప్రస్ఫుటమైంది. 'శివ'తో శివాలు ఎత్తినట్లు 'ఆటగదరా శివా' అంటూ 'నాలోన శివుడు కలడూ' అంటూ 'నట'రాజమూర్తిని దర్శింపజేసిన ఈ తనికెళ్ళ సాహిత్య దిగ్గంతుడు మరి!
తన కలంలో సరస్వతి 'పరికిణి' కట్టుకొని ఆనంద 'నక్షత్ర దర్శనం' చేయిస్తుంది. 'ఎందరో మహానుభావుల'ను తనతో పరిచయం చేయిస్తుంది. మునుపు సినీకారుల ఇంటర్వ్యూలో డాక్టర్ను కాబోయి యాక్టర్ నయ్యాను' అని చెప్పుకోవడం గురించి అందరూ చెప్పుకునేవారు. కానీ యాక్టర్ అయి, డాక్టరు అందునా గౌరవ డాక్టరేట్ అందుకున్న భరణి గారికి హాస్యానందం అభినందనలు తెలుసుతుంది. ఈ సందర్భంగా బాపురమణ అకాడమీ, హాస్యానందం, అక్షజ్ఞ ప్రచురణలు భరణి గారికి చిరు సత్కారం చేసి... వారి ఆనందాన్ని వ్యక్త పరిచారు.








## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు

**4000 రూపాయల బహుమతులు**

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో
**ప్రతి నెలా** హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి
కొన్ని మంచి కార్టూన్లకు **ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**



'కార్టూన్ మిత్ర'
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు**
బహుమతిగా ఇస్తున్నారు.











**శ్రీమతి నమ్మి మధుబాల**
**(బాపు) రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్)**
కార్టూన్ కళ పై ఆరాధనతో... ఈ మూడు ప్రోత్సాహక బహుమానం ఇస్తున్నారు.


← మొదటి బహుమతి- **రూ.500/-లు**
↙ రెండవ బహుమతి- **రూ.300/-లు**
↓ మూడవ బహుమతి- **రూ.200/-లు**






కార్టూనిస్ట్ **శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







**శ్రీకుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
ఈ కార్టూన్‌కి
**500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






**దివ్యశ్రీ శ్రీమతి చిట్టావఝ్ఝుల యల్లారి**
**బాల వెంకట సత్య సూర్యకాంతం** జ్ఞాపకార్థం
కుమార్తెలు **మల్లిక, లక్ష్మీ** అందిస్తున్న
ప్రోత్సాహక బహుమానం-
**500 రూపాయలు**




## ప్రతి నెలా పోటీలే!

కార్టూనిస్టు మిత్రులకు నమస్కారం. ప్రతి నెలా హాస్యానందంకు వచ్చే కార్టూన్లలోంచి **8 మంచి కార్టూన్లకు బహుమతులు** ఇస్తున్నారు కార్టూన్ ఇష్టులు! మీరు ఇక నుంచి పంపే కార్టూన్లకు బహుమతి రావాలనే ఉద్దేశంతోనే కార్టూన్లు గీయండి! సందేశాలున్నప్పటికీ హాస్యం మాత్రం 'మిస్' కాకుండ చూస్కొంటే... మీకు బహుమతి 'మిస్' అవ్వదు. ఆల్ ది బెస్ట్!




డాక్టర్ కప్పగంతు రామకృష్ణ
*ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ పాలక మండలి సభ్యులు*
90320 44115

**ఆధునికత పెరిగిన ఇప్పటి తరంలో భాష కూడా ఎన్నో ఆధునిక పోకడలు పోతోంది. దీని వల్ల అర్థాలు మారి అనర్థాలు జరుగుతున్నాయి. తెలుగు మాట్లాడే క్రమంలో జరిగే పొరపాట్లు, వాటివల్ల జరిగే తప్పులు, వాటిని సరిచేసుకోవాల్సిన విధానాలు అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో... భాషా చమత్కారాన్ని ఉపయోగిస్తూ చేస్తున్న ప్రయత్నం ఇది.**

**(గత సంచిక తరువాయి)**

**బ**డి నుంచి అలా వచ్చి, ఇలా కుర్చీలో కూర్చున్నానో లేదో...

"మాస్టారూ! మాస్టారూ...!" అంటూ గావుకేకలు పెడుతూ, ఏదో అనర్థం జరిగినట్లు పరిగెత్తుకుంటూ వచ్చాడు సారథి.

"ఏమిటయ్యా... నీ హడావిడి! ఏమిటా కంగారు. అసలేం జరిగింది?" అంటూ సారథిని కుర్చీలో కూర్చోబెట్టాను.

అతగాడి గావుకేకలు విని పెరట్లో ఉన్న నా రత్నం కూడా కంగారుపడుతూ వాకిట్లోకి వచ్చింది.

"మా సంస్థ నిర్వహణలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు చేస్తున్నాం మాస్టారూ. మీరు తప్పకుండా రావాలి. మీకు తెలిసే ఉంటారు... ప్రపంచస్థాయి సభలు నిర్వహిస్తూ మన తెలుగు భాష కోసం గొప్ప సేవ చేస్తున్న దామోదరం గారిని ముఖ్య అతిథిగా పిలిచాం. ఆయనకు 'తెలుగు సేవక' బిరుదు కూడా ఇవ్వబోతున్నాం. మీరు తప్పకుండా రావాలి..." అంటూ అహ్వానపత్రిక చేతిలో పెట్టాడు పార్థసారథి.


"దామోదరం గారు మా గొప్ప మనిషి మాస్టారూ... ఇవాళ మన తెలుగుభాష ఉచ్ఛస్థితిలో ఉండటానికి కారణం ఆయనే అని చెప్పక తప్పదు. ఎంతోమంది ఆయన దగ్గర సుస్రూస చేసి మరీ బాష నేర్చుకోవడానికి వస్తారు. ఆయన రాసిన 'బాషా సామ్రాట్' వ్యాస సంకలనం, 'నిర్ణిద్ర గానం' కవితా సంకలనం పుస్తకాలు తెలుగుతల్లి పాపిట సింధూరంగా ప్రకాశిస్తున్నాయి..." ఒక్కక్షణం ఆగి....

"తెలుగుకోసం ఆయన చేసిన సేవలు ఇన్ని అని నిర్దారణ చెయ్యలేం..." అంటూ ఆయన గురించి ఇంకా ఏవో చెప్పబోతున్నాడు.

"సారథీ! అంటూ శంకరాభరణం శంకరశాస్త్రి తరహాలో నేను గట్టిగా అరవడంతో ఉలిక్కిపడి, బిక్కమొహం వేసాడు సారథి.

"ఏమిటి నువ్వు చేసేది నీ తలకాయ వేడుకలు. దినోత్సవం అనే పదంలోనే ఉత్సవం ఉంది. ఇంకా ప్రత్యేకంగా వేడుకలు అనే పదం ఎందుకు. తెలుగు భాషా దినోత్సవం అంటే సరిపోతుంది...

అసలు, నీలాంటి వాళ్ళ వల్లే తెలుగుతల్లి కోమాలోకి వెళ్ళిపోయింది. తెలుగు భాష **ఉచ్ఛస్థితిలో** ఉన్నది అనకూడదు... **ఉచ్చస్థితి** అనాలి. ఉచ్చస్థితి అంటే ఉన్నతం, పొడవు అని అర్థం. భాష పరిస్థితి ఎలా ఉన్నదో చెప్పడం చేతకాని నువ్వు భాషా దినోత్సవం చేస్తావా?!




నీలాంటి అరగుండు వెధవలు సుస్రూస చేయబట్టే, అలాంటి పెద్దల పరిస్థితి, తెలుగుభాష పరిస్థితి ఈ దశకు చేరుకున్నాయి. అది **సుస్రూస** కాదు చవట సన్నాసీ... **శుశ్రూష** అని మాత్రమే రాయాలి. అలాగే పలకాలి. సుశ్రూష, శుస్రూష, సుస్రూస – ఇవన్నీ తప్పులే...

అదిసరే కానీ, ఉదయం నుంచీ ఏమీ తినలేదా ఏమిటి? తెలుగు అక్షరాల ఒత్తులు మింగుతున్నావు. భాష అని చక్కగా, దోషం లేకుండా పలకడం చేతకాని నువ్వు తెలుగుభాషా దినోత్సవం చేస్తావా? ఛీ... ఇక, **సామ్రాట్** కాదురా దద్దమ్మా. **సమ్రాట్** అని మాత్రమే రాయాలి.

అలాగే, నిర్ణిద్ర అనకూడదు. **నిర్నిద్ర** అని మాత్రమే రాయాలి. అలాగే పలకాలి.

నీ బోడి భాషా పరిజ్ఞానానికి... కవిత్వం కూడానా? ఆయన రాసిన పుస్తకాలన్నీ తెలుగు తల్లి పాపిట సింధూరంగా ఉన్నాయా? **పాపిట** అనేది తప్పు పదం. **పాపట** అని మాత్రమే రాయాలి. పాపట అంటే కేశవీధి అని అర్థం. అలాగే, **సింధూరం** కాదు. **సిందూరం** అని రాయాలి. అలాగే పలకాలి కూడా.


సింధురం అంటే ఏనుగు అని అర్థం.

కాబట్టి, గంగసింధూరం వంటి పదాలు పలక కూడదు. రాయకూడదు. గంగసిందూరం అని మాత్రమే రాయాలి.

ఇక, నువ్వు పిలిచే ముఖ్యఅతిథి గురించి నువ్వేమీ నిర్దారణ చెయ్యకూడదు... ఒకవేళ నిజంగా నువ్వు నిజంగా నిర్దారణ చేస్తే, క్షణాల్లో ఆయన ప్రాణం గాల్లో కలిసిపోతుంది. ఎందుకంటే, **నిర్దారణ** అంటే చక్కగా చీల్చుట అని అర్థం. **నిర్ధారణ** అంటే నిశ్చయం అని అర్థం...కాబట్టి, నిశ్చయంగా చెప్పే విషయం లో నిర్ధారణ లేదా నిర్ధారణము అని మాత్రమే రాయాలి..."

ప్రహ్లాదుడిని కాపాడటానికి వచ్చిన నర సింహస్వామిలాగా వీరావేశం తన్నుకొచ్చింది నాలో.

ఇన్ని తప్పులు మాట్లాడే నీకు తెలుగు భాష గొప్పదనం గురించి, జరిగే భాషాసేవ గురించి కనీసంగా కూడా మాట్లాడే అర్హత లేదు. ఛీ... ఫో!... అంటూ ఊగిపోయాన్నేను.




"ఇక ఆగండి... చాలు! రోజురోజుకీ మీ ఆగడాలు మించిపోతున్నాయి... ఉపన్యాసం ఆపుతారా లేదా... అంటూ రత్నం నా చెయ్యి పట్టుకుని గుంజడంతో... ఈ లోకంలోకి వచ్చాను.

కాళ్ళ దగ్గరగా గుడ్లు తేలేసి, పడుకున్న సారథి కనిపించాడు.

ఎప్పుడొచ్చారో, ఏమో? బడి నుంచి వచ్చిన నా బిడ్డలిద్దరూ బిక్కుబిక్కు మంటూ రోడ్డు మీదే నిల్చున్నారు.


"రాను రాను... మరీ ఇంత మొండిగా తయారవుతున్నారేమిటండీ... నా ఖర్మ! నా తెలుగు, నా భాష అనుకుంటూ రోజూ ఎవరి తో ఒకరితో గొడవ పడాల్సిందేనా! అంతా నా ఖర్మండీ... నా ఖర్మ. ఏ పండక్కి పుట్టింటికి వెళ్ళినా, అల్లుడుగారు రాలేదు కదమ్మా?... అంటూ అమ్మానాన్న పలకరిస్తుంటే, మిమ్మల్ని చూసి వాళ్ళెంత జడుసుకున్నారో అర్థమవు తుంది....

అంతేనా? ఏ పేరంటానికి మాస్టారి భార్య వచ్చింది. నోరు అదుపులో పెట్టుకుని మాట్లా డండమ్మా అంటూ సాటివారు ఎగతాళిగా అంటుంటే తట్టుకోలేకపోతున్నా. అయ్యో... అయ్యో... నాకే ఈ ఖర్మ ఏమిటండీ..."

రత్నం ఇది ఖర్మ కాదే. ఖర్మ అనకూడదు... అంటూ ఇంకా ఏదో అనబోయేంతలో, రత్నం నా నోటికి తన చెయ్యి అడ్డం పెట్టి, అమాంతం లోపలికి లాక్కుని వెళ్ళింది.

"బతుకు జీవుడా..." అనుకుంటూ రెండు చేతులెత్తి నా రత్నానికి నమస్కారం పెట్టి, సెకనులో మాయమయ్యాడు సారథి.

ఇన్ని తప్పులు దిద్దిన నన్ను... కనీసంగా కూడా పలకరించకుండా, నా రత్నానికి అత గాడు దణ్ణం ఎందుకు పెట్టాడో? అర్థంకాక బుర్ర గోక్కుంటుంటే... నున్నటి రహదారి లాంటి నడినెత్తి మీద గోరు గుచ్చుకున్న బాధ... అమ్మా...! **(సశేషం)**



డా॥కె.వి.రమణ, ఐ.ఎ.ఎస్(రి) ఆశీస్సులతో

## గుదిబండి వెంకట రెడ్డి, హాస్యానందం సౌజన్యంతో

## నిర్వహిస్తున్న కార్టూన్ పోటీ



శ్రీ గుదిబండి వెంకట రెడ్డి గారు కార్టూనిస్టులను
ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో
ఈ కార్టూన్ పోటీ నిర్వహిస్తున్నారు.
కార్టూనిస్టు మిత్రులు అందరూ పాల్గొనాలని మా మనవి

**10 బహుమతులు**
**ఒకోక్కటి 3000 రూపాయలు**

**మెమొంటో + సర్టిఫికెట్**



కార్టూన్లు చేరవలసిన ఆఖరి తేదీ: డిశంబర్, 10, 2024
ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను-
hasyanandampoteelu@gmail.com

### నిబంధనలు

- 'అంశం' ఏదైనా ఫరవాలేదు గానీ నవ్వు పుట్టించేలా కార్టూన్లు ఉండాలి. దయచేసి అశ్లీల అంశాల జోలికెళ్ళొద్దు!
- పోటీలో పాల్గొనే కార్టూనిస్టులు, తాము పంపే మెయిల్‌లో పేరు, ఫోన్ నెంబరు తప్పని సరిగా ఉండాలి!
- కార్టూన్లు తప్పని సరిగా దీర్ఘచతురస్రములోనే పంపించాలి. పాకెట్ సైజు కార్టూన్లు దయచేసి పంపవద్దు.
- బహుమతి ప్రదానోత్సవ సభ **ఫిబ్రవరి 2025 లో హైదరాబాదులో జరుగుతుంది.** వివరాలు ఫిబ్రవరి హాస్యానందంలో ప్రచురిస్తాం!

# బాచి అవార్డు -2024 పురస్కారం మరియు
# శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక కార్టూన్ల పోటీ విజేతలకు
# బహుమతి ప్రదానోత్సవం!

ప్రముఖ కార్టూనిస్టు శ్రీ బాచిగారు వారి తల్లిగారు–శ్రీమతి అన్నం భాగ్యవతి పేరిట నిర్వహించిన కార్టూన్ల పోటీ మరియు కార్టూన్ ఇష్టులు శ్రీఎస్.వి.రమణగారు వారి తల్లి దండ్రులు శ్రీసోమయాజుల శివ రామయ్య, హైమవతి వార్ల స్మారకంగా హాస్యానందం సౌజన్యంతో నిర్వహించిన కార్టూన్ పోటీలో గెలుపొందిన కార్టూని స్టులకు బహుమతి ప్రదానోత్సవం ఆగస్టు 15 విజయ వాడలో బాలోత్సవ భవనంలో సాయంత్రం 6 గంట లకు వైభవంగా జరిగింది.




దూర ప్రాంతాల నుంచి కార్టూనిస్టులు ఈ సభలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ పోటీల్లో ఈ సంవత్సరం ఎక్కువమంది కార్టూ నిస్టులు పాల్గొన్నారు.

ఈ సారి ఎక్కువమంది విద్యార్థులు, విద్యార్థినులు పాల్గోవడం విశేషం.

ఈ సభను రోటరీక్లబ్ విజయవాడ సెంట్రల్‌వారు నిర్వహించారు.

ప్రముఖ కార్టూనిస్టు శ్రీ సరసిగారు, హాస్యానందం ఎడిటర్ శ్రీరాము గారు, పోటీ నిర్వాహకులు ప్రముఖ కార్టూనిస్టు శ్రీ బాచిగారు, శ్రీ ఎస్.వి.రమణగారు, బాబుల్ ఎన్.జి.ఓ.ప్రెసిడెంట్ శ్రీ గంగాధర్ పాండే, రోటరీ క్లబ్ నూతన ప్రెసిడెంట్‌గా నియమితులైన ప్రముఖ కార్టూనిస్టు శ్రీ పద్మదాస్‌గారు, సెక్రటరీ శ్రీ కిషోర్‌గారు, అతిథులుగా వేదికపై ఆసీనులైనారు.

**బాచి పురస్కార ప్రదానం–**

శ్రీప్రసిద్ధ –మొదటి బహుమతి, శ్రీ గిరి–రెండవ బహుమతి, శ్రీఅత్తలూరి–మూడవ బహుమతి అందుకోగా...

ప్రత్యేక జ్యూరీ బహుమతులు– వినోద్, చక్రవర్తి, శేఖర్‌బాబు, శ్రీకర్, ఆయుషి, బి.చక్రిక, సంహిత, కె.లక్ష్మీలిఖిత, కె.సుప్రియ, జి.కుష్మిత అందుకోగా మరో పదిమంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వటం జరిగింది.

**సోమయాజుల పురస్కార ప్రదానం–**

శ్రీ ఎస్.వి.రమణ (అరుణ్) –మొదటి బహుమతి, శ్రీతోపల్లి ఆనంద్ –రెండవ బహుమతి, శ్రీమతి పద్మ –మూడవ బహుమతి అందుకోగా...

ప్రత్యేక జ్యూరీ బహుమతులు– నాగిశెట్టి, సునీల్, శివ, ఓంకార్, టి.ఆర్.బాబు అందుకున్నారు.

ఈ సభలో ప్రముఖ కార్టూనిస్టు శ్రీ ప్రసిద్ధగారి కార్టూన్ల పుస్తకం ఆవిష్కరించబడింది.

సోమయాజుల పురస్కారం ప్రముఖ కార్టూనిస్టు వాడ్రేవు శ్రీనివాస్ గారు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందుకున్నారు.

డా॥కప్పగంతు రామకృష్ణ గారు సభను ఆద్యాంతం ఆహ్లాదంగా నిర్వహించారు.




నిర్వాహకులు– అతిథు లను కృతజ్ఞతపూర్వకంగా సత్కరించారు.

కార్యక్రమం చివరిలో ఏర్పాటు చేసిన చక్కటి విందులో కార్టూనిస్టులు, కార్టూన్ ఇష్టులు పాల్గొని కార్యక్రమాన్ని ఆనందంగా ముగించారు.

**–ఎస్.కె.వి.**



కథ-కథనం

యండమూరి వీరేంద్రనాథ్

యర్రంశెట్టి శాయి



# కొంగుచాటు కృష్ణుడు



**గతంలో...** రంభ, ఊర్వశి, తిలోత్తమలు ముగ్గురూ కలిసి ప్రారంభించిన 'మన్మధా మెన్స్ బ్యూటీ పార్లర్' మూడవ బ్రాంచి ప్రారంభంతో పాటు 'మేడ్ ఫర్ ఈచదర్' పోటీని ప్రకటించారు. ఆ పోటీలో పాల్గొన డానికి దేవలోకంలో అందరూ సిద్ధమవుతున్నారు... ఈలోగా మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, సరస్వతి ముగ్గురు మగ పిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. భర్తతో సవాలు చేసి సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. కెమిస్ట్రీ ల్యాబులో రహస్యంగా చేస్తున్న ప్రయోగం ఫలించక ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు. **ఆ తర్వాత...**

**వేజ్ మరింత వేగంగా వెనక్కు వచ్చి లలితా దేవి భుజానికి తగిలింది. లోపల ఎముక ఫ్రాక్చర్ అయిందేమో అన్నంత బాధ కలిగింది.**

**ఆమె పరిస్థితి ఎలుక్కి చెలగాటం, పిల్లికి సంకటంలా అయింది.**

**ఏమి చెయ్యాలో తెలియక నిశ్చేష్టంగా నిలబడిపోయింది.**

**అంతలో ఎలుక మరో అడుగు ముందుకు వేసింది!**

**దాని తోక నెమ్మదిగా పైకి లేవటం ప్రారంభించింది!**

**చూస్తూండగానే అది సముద్రపు ఒడ్డున లైట్-హౌస్ లా లేచి నిటారుగా నిలబడింది.**

**ఆమె బెదిరి వీధి దద్దరిల్లేలా కెవ్వున కేకవేసింది!**

ఆ కేక పక్క వీధి టౌన్-హాల్ వరకూ వినిపించింది కానీ, ఆమె ఏదైనా సీరియల్ చూస్తోందేమో, అందులో వంటలక్క ప్రసవం సీనేమో అని ఇరుగుపొరుగు వాళ్ళు పట్టించుకో లేదు.

నాలుగైదు కేకల తరువాత పరుగెత్తుకు వచ్చి తలుపు కొట్టారు.

ఎలుకపై నుంచి దృష్టి మరల్చకుండా ఊపిరి బిగపట్టి గడప వరకూ నడిచి, పడగ్గది దాటగానే... శరవేగంతో పరుగెత్తి, వీధి తలుపు తెరిచింది.

అయిదారుగురు ఆడా, మగా... "ఏమిటి?! ఏం జరి గింది?" అంటూ బిలబిలా లోపలకు జొరబడుతూ అడి గారు.

వగరుస్తూ ఎలుకని చూపించింది.

వాళ్ళకేమీ అర్థం కాలేదు.

చేతిలో కర్ర గాల్లోకి తిప్పుతూ "దొంగలొచ్చారా?" అని అడిగాడొకాయన.

"కా... కాదు!" అనబోతూ ఉంటే... "ఎవరైనా తలుపు కొట్టారా?" అని మరొకరు అడిగారు.

గది మధ్యలో నిలబడ్డ మూషికాన్ని చూపించి...

"ఎ...ఎ...ఎ...ఎలుక!" అన్నది.

అందరూ అటు చూశారు.

శత్రుదేశాన్ని గెలిచిన రాజులా రెండు కాళ్ళ మీదా నిలబడి ఉంది జూకా.

అందరూ ఘొల్లున నవ్వారు.

"ఎలకా?!... హాఁ... ఆఫ్టరాల్ ఎలుకను చూసి భయపడు తున్నారా?" పెళ్ళానికి దూరంగా జరుగుతూ అన్నాడు పక్కింటాయన.

"దాన్దేఁ ఉంది? మా ఆడబిడ్డకు బొద్దింకంటే భయం... హ్హా...హ్హా...హ్హా!" అన్నదొక స్థూలకాయని.

"మా ఫ్యాన్‌కి పెద్ద పులంటే భయం!" అన్నాడు అగ్ని హోత్రుడు అనే ఆఫీసరు.

"మన పక్క వీధి రామారావుకి పనిమనిషి అంటే భయం!" జోకారు ఒకరు.

అందరూ మళ్ళీ ఘొల్లుమన్నారు.

"కొందరికి కొన్ని జంతువులను చూస్తే భయం... రావణుడికి కోతులంటే భయం!..." ప్రవచనం చేశారు మరొకరు.

"అర్ధరాత్రి చిట్టెలకని చూస్తే, పరిహారార్థం మరుసటి రోజు ప్రొద్దున్నే ఎడమ చేత్తో జీలకర్రా బెల్లం బొడ్డు మీద పెట్టుకోవాల్ట. మొన్న టి.విలో చెప్పారు!" అంది కొత్తగా పెళ్ళయిన ఒక అతివ.

"అర్ధరాత్రి వరకూ మేలుకునే అదృష్టం మాకు లేదులే

అమ్మా!" అంది ఒక ప్రౌఢ సెల్-ఫోను సుతా రంగా నిమురుతూ.

మనుష్యులింత బేవార్సుగా మాట్లాడు కుంటారా అన్నట్టు జూకా అందర్నీ తేరపార చూస్తోంది.

ఈలోపు ఓ గొంతు గట్టిగా-

"మనకా ముచ్చట్లు ప్రస్తుతం అవసరమా? ముందా ఎలుకను తోలెయ్యండి.... పాపం లలితాదేవిగారు భయపడుతున్నారు!" అని అరిచింది.

చేతిలో కర్ర ఉన్న పెద్దమనిషి లోపలికి వెళ్ళి జూకా నెత్తి మీద బలంగా బాదాడు.

అయితే ఆ కర్ర ఎలుక నెత్తి వరకూ బాగానే వెళ్ళింది కానీ, ఆ తరువాతేం జరిగిందో ఎవరికీ తెలీదు. కర్రతో సహా సదరు పెద్ద మనిషి వెనక్కి విరుచుకు పడిపోయాడు.

అందరూ నిశ్చేష్టులయి నిలబడిపోయారు.

'బై' చెప్పినట్టూ తోకాడించి, జూకా మంచం కిందికి వెళ్ళి పోయింది.


ఇక్కడ ఇలా జరుగుతున్న సమయానికి బషీర్ తన బాస్‌కి ఫోన్ చేశాడు.

"పాకిస్తాన్‌లో పచ్చటి పొలాలు..."

"పి.ఒ.కే లో ఎర్ర తివాచీలు!"

"బాస్! ఆ కాలనీలో ఉన్న మన ఇన్ఫార్మర్ 004 అక్కడేదో ఎలుక గొడవ చేస్తోందని... కబురు చేశాడు.... నాకేదో అనుమానంగా ఉంది. అది బహుశ మన చంద్రబోసు ఎలుకే అయి ఉంటుంది."






"నేను బయల్దేరుతున్నాను. నువ్వు టాక్సీ వేసుకుని వచ్చేయ్!"

బషీర్ నసుగుతూ... "డబ్బుల్లేవు బాస్!" అన్నాడు.

"అయితే వెంటనే సైకిల్ మీద వచ్చెయ్!"

"ముందు చక్రంలో గాలి లేదు."

"కొట్టించు!"

"డబ్బు లేదన్నాగా!..." అన్నాడు బషీర్ విసుగ్గా.

"పరవాలేదు. కారు చక్రంలో గాలి లేకుండా జేమ్స్‌బాండ్ విలన్ని వెంటాడతాడు... నువ్వు కూడా అలా వచ్చేయ్...." అని ఆగి...

"...చూడు బషీర్! ఒక్క విషయం గుర్తు పెట్టుకో. ఈ ఆపరేషన్లో మనం ఎవరు మర ణించినా, పాకిస్తాన్ మనకి పరంపర చక్ర ఇస్తుందని ప్రెసిడెంట్ నవాజ్ షరీఫ్ చెప్పాడు. దాన్ని ఊహించుకుంటూ పనులు చేయి."


"మరి స్వర్గంలో 72 మంది దేవకన్యలో..." నసిగాడు బషీర్.

"పగలు పరంపర చక్ర కలలు కను!... రాత్రిళ్ళు కన్నె పిల్లలు! అలా ఊహించుకో. వెంటనే రా!" అంటూ ఫోన్ పెట్టేసాడు చీఫ్.

గాలి లేని సైకిల్ మీద 'వెంటనే' రావడం ఎలాగో బషీర్‌కి అర్థం కాలేదు.

"...పై వాడు చెప్పింది తూ.చా. తప్పకుండా పాటించు!" అన్నది గూఢచారి ట్రైనింగులో చెప్పే మొట్టమొదటి పాఠం! అందుకని సైకిల్ పట్టుకుని వేగంగా పరుగెడుతూ బయల్దేరాడు. చెరోవైపు నుంచీ ఇద్దరూ చంద్రబోసు ఇంటికి చేరుకునే సరికి, కాలనీ జనమంతా బోనులో ఎలుకల్లా గదిలో బంధింపబడి ఉన్నారు.

వాళ్ళు గదిలోంచి బయటకి రాకుండా గుమ్మం దగ్గర పులిలా పహారా కాస్తోంది జూకా.




ఇద్దరూ గుమ్మం చాటు నుంచి దాన్ని చూసారు.

కిరాతార్జునీయం కథలో బోయవాని వేషం లో శివుడు భూమ్మీదకి వస్తున్నప్పుడు, 'నెల వంక తలపాగ నెమలి ఈకగ మారే... తలపైని గంగమ్మ తలపు లోనికి జారే, నిప్పులుమిసే కన్ను నిలువు బొట్టాయే బూదిపూతకు మారు పులితోలు వలువాయె...' అంటాడు కవి.

అదే విధంగా తనని ఎంతగానో లాలించి, ప్రేమించి, అభిమానించిన చంద్రబోసు ఆత్మ హత్యకు కారణభూతమైన ఆమెను భయపెట్ట టానికి "చిరు బొజ్జ గణపయ్య చరణాల వీడి, మల్లెమాల బోసు మందు తాగి, ముదిత లలిత ధైర్యమ్ము మూలాలు కూల్చ, మువ్వన్నె గీతల మూషికమ్ము వచ్చె" అన్నట్టుగా ఉంది జూకా.


పాకిస్తాన్ ఏజెంట్స్ ఇద్దరూ తనని అదోలా చూడటం చూసి, నేల మీద నుంచి సీలింగ్ ఫ్యాన్ మీదకు ఎగిరి, అక్కణ్ణుంచి లలితాదేవి మంచం మీదకు నోస్-డైవ్ చేసింది.

"సూపర్ ర్యాట్!" అంటూ అరిచాడు బషీర్.

"అరవకు! నోర్ముయ్!!" అని అరిచాడు ట్రిబుల్-జీరో.

"చంద్రబోసు ఎలాగో చచ్చాడు... వాడి ప్రయోగం ఫలించిందని ఇక్కడి జనాలకి తెలిసే లోపులో మనం ఆ ఫార్ములాని చిక్కించు కుంటే పాకిస్తాన్ వెళ్ళిపోవచ్చు" అని అతడి చెవిలో చెప్పాడు.

బషీర్ అర్ధ నిమీలిత నేత్రాలతో "పగలు పాకిస్తాన్లో పరంపర చక్ర. రాత్రిళ్ళు స్వర్గంలో దేవకన్యలు..." అంటూ నాలుకతో పెదాలు




తడుపు కున్నాడు.

ఇంతలో జుకా మంచం మీద నుంచి గబ్బిలంలా పైకి ఎగిరి బషీర్ మొహాన్ని పట్టుకొని కింది పెదవిని గట్టిగా కొరికి, తిరిగి ఫ్యాన్ మీదకు దూకింది.

బషీర్ కెవ్వున ఆర్తనాదించాడు.

జెమినీ సర్కసుకు ఏమాత్రం తీసిపోని ఆ దృశ్యాన్ని అందరూ కళ్ళప్పగించి చూశారు.

ఆ కాలనీ మాజీ ప్రెసిడెంటు చుట్టూ ఉన్న జనాలతో... "ఈ అద్భుత శక్తులున్న ఎలకని చంపి గుడి కడితే, దాని మీద వచ్చే చందాలతో మన కాలనీ నీటి సమస్య సాల్వ్ అయి పోతుంది!" అన్నాడు.

"ఎలక్కి దేవాలయమా?" ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగం చేసుకుంటున్న ఒక మాజీ నాస్తిక నక్సలైట్ అన్నాడు.

"ఏం!? పాములకి గుళ్ళు లేవా?... ఎలక్కి ఉంటే తప్పేమిటి?"

"అపచారం! అపచారం!!" లెంపలు వేసుకుంది ఒక పెద్దావిడ.

"దాని తోక ఎంత బలంగా ఉందో..! ప్రాణాలతో దొరికితే బావుణ్ణు. మా పడగ్గదిలో పెట్టి మా ఆయనతో రోజూ దాని పుష్ప భాగానికి పూజలు చేయించేదాన్ని..." సంతానం లేని ఓ మధ్య వయస్కురాలు వాపోయింది.

"అది పారిపోద్ది!"

"మొన్న నాగులచవితి రోజున ఒకామె పాముని సీసాలో పెట్టి పసుపు రాసి పూజ చేసింది కదా! అలాగే పెట్టేదాన్ని!..." అన్నది సంతాన రహిత సౌభాగ్య లక్ష్మి.

"అవును!... ఆ వీడియో వైరల్ కూడా అయింది. నేను చూశాను... వచ్చే ఏడాది మేము కూడా అలా చేద్దామని నేనూ, నా భార్యా కూడా అనుకున్నాము!" అన్నాడు రోజుకి ముప్ఫై గంటల వీడియో వీక్షకుడు. అతని క్కూడా పిల్లలు లేరు. ఉండరు కూడా.

ఈ సంభాషణ ఓ మూల ఇలా జరుగుతూ ఉంటే ట్రిబుల్-జీరో, "వాడు ఆ ఫార్ములా ఎక్కడ పెట్టి ఉంటాడు?" అని బషీర్‌ని రహస్యంగా అడిగాడు.

"సైన్స్ ల్యాబ్‌లో. కానీ దొరకదు!" అన్నాడు బషీర్ విచారంగా.

"ఏం? పాస్-వర్డ్ తెలీదా?"

"కాదు. చెక్క డ్రాయరు. తుప్పు పట్టింది. అరగంట కష్టపడితే తప్ప బోసుకి కూడా రాదు."

"బద్దలు కొడదాం!"

"బ్రద్దలు కొడితే చూసేవాళ్ళు ఊరుకుంటారా?"


"తాళాలు నైట్ వాచ్‌మాన్ దగ్గర ఉంటాయి కదా! డబ్బులిస్తే వాడు ఇవ్వడా?"

"ఇవ్వడు! వాడికి నేనంటే పడదు. రాత్రిళ్ళు స్కూలు స్పిరిట్ రహస్యంగా తాగేస్తున్నాడని మా హెడ్-మాస్టర్కి వాడి మీద అనుమానం. అది నేనే చెప్పానని వాడికి నామీద అనుమానం."

"మరేం చేద్దాం?"

బషీర్ ఆలోచించి-"ఐడియా!..." అని అరిచాడు.

"...మొన్న గాంధీ బజార్‌లో అచ్చు బోసు పోలికలున్న ఒక కుర్రాణ్ణి చూశాను. బోసు తమ్ముడేమో అనుకుని అయిదు రూపాయలు అప్పు అడిగాను కూడా."



“వాడిని నేనూ చూశాను. విషయం చెప్పు”.

“వాడు మన కన్నా బేవార్సుగాడు. రెండు రూపాయలిస్తే ఏ పని చెప్పినా చేస్తాడు. వాడితో డ్రాయర్ తీయిస్తే?”

“రెండ్రూపాయలకి తియ్యడు”.

“అయిదిద్దాం!”

“అంత తక్కువకి ఒప్పుకోడు!”

“తాళం తీయటానికి అంతకన్నా అనవసరం!”

“తాళమా? అయితే ఓకే. వాడి పేరు?”

“గూటాలపల్లి ఆనందరావు!”

✦✦✦

సరస్వతి సృష్టించిన రెండో బొమ్మ గూటాలపల్లి ఆనందరావు గదిలో వెల్లకిలా పడుకొని విపరీతంగా సిగరెట్లు కాల్చేస్తున్నాడు.

అతడు ప్రస్తుతం పెద్ద సమస్య లో ఉన్నాడు. అతడి సమస్య గది!

అర్జెంటుగా గది ఖాళీ చేయాలి!

గదులు ఖాళీ చెయ్యమని సాధారణంగా ఇంటి యజమానులు అడుగుతూ ఉంటారు. కానీ ఇక్కడ గది ఖాళీ చేసి వెళ్ళిపొమ్మని అడుగుతున్నది ఆ వీధి ప్రజలు.... అందరూ కలిసి మొత్తంగా వేడుకున్నారు. కారణం?

ఆనందరావు అద్భుతమయిన అందగాడు. ఇంద్రుని కొడుకు జయంతుడంతటి సౌందర్యవంతుడు. అతడి అందానికి ఆ వీధిలో ఆఫీసరుగారి భార్య నుంచీ, ఆ ఇంటి పనిమనిషి వరకూ అందరూ దాసోహం అన్నారు. సగం మందికి అతడు బిస్కట్ వేస్తాడు. సగం మంది అతడికి లైన్ వేస్తారు.


ఆ వీధిలోనే ఎమ్మే చదువుతున్న... ఒక గణాంక (స్టాటిస్టిక్స్) విద్యార్థి లెక్క ప్రకారం, ఆ వీధిలో ఉన్న అమ్మాయిలూ, ప్రౌఢలు, ముగ్ధల్లో 76.457 శాతానికి అతడితో దగ్గర సంబంధం ఉంది. సంబంధం రెండు రకాలు. ఛాటింగ్ సంబంధం (40%), ఇంకా దగ్గర సంబంధం(60%). ఆ 40% చాటింగ్‌లో మళ్ళీ 15% పవిత్ర ఛాటింగ్, 20% అక్కా-తమ్ముడు ఛాటింగ్, 65% బూతు ఛాటింగ్! తమవారు ఆ మిగతా 23.543 శాతంలోనే ఉన్నారని ఆ కాలనీ వాళ్ళు సంతృప్తి పడుతూ ఉన్నారు! ఇంకొంత కాలం పోతే అది సున్నా శాతం అవుతుందని భయపడుతున్నారు!


అమ్మాయిలకి వెయ్యటానికి అతడి దగ్గర చాలా వెరైటీల బిస్కట్లు ఉన్నాయి!... అందం పొగిడి ముగ్గులోకి దింపటం మిల్క్-బికీస్..! ముప్పై దాటినవారి పిల్లల తెలివిని పొగుడుతూ దగ్గరవటం హాపీ-హాపీ! నలభైవారి కష్టాలూ, విషాదాలూ వినటం మారీ-గోల్డ్, అమ్మాయిలు భావకులయితే... నది ఒడ్డున కూర్చుని (కేవలం కంఠతా పట్టిన రెండు మూడు) కృష్ణశాస్త్రి కవితలు చెప్పటం గుడ్-డే, బెంగాలీ కండువా కప్పుకుని విప్లవకన్నెలతో వామపక్ష ఫిలాసఫీ చర్చించటం క్రాక్-జాక్, వచన గేయ రచయిత్రులు వ్రాసినది వింటూ ‘ఆహా... ఓహో....ఒహోహో...’ అనటం ఫిఫ్టీ-ఫిఫ్టీ, ప్రాథమిక పరిచయాల సాగదీత లేకుండా ఒక్క గెంతులో గమ్యానికి సాగిపోవటం డార్క్-ఫాంటసి.

ఆనందరావు మాటకారి. ఈ విషయం ఒక ఉదాహరణతో మరింత వివరంగా అర్థం చేసుకోవచ్చు. అదే వీధిలోని ఉన్న ఒక ప్రౌఢ తొలి పరిచయంలో అతడిని “ఈ వీధిలో నిన్ను చాలా రోజుల నుంచీ చూస్తున్నా ఆనందరావ్. ఎందుకీ క్షుద్రమైన పనులు చేస్తున్నావ్?...” అంటూ మందలించింది.

“మీరు నెలకోసారి వెళ్లి పుణ్యక్షేత్రాలు దర్శిస్తారు. వారానికి ఆరు రోజులు పూజలు చేస్తారు. ఎందుకు ఆంటీ?” అని అడిగాడు.

“మనశ్శాంతి కోసం! అలౌకికమైన ఆనందం కోసం! అంతరంగ సంతోషం కోసం!” కళ్ళు అరమోడ్పులు చేసి అన్నది. **(సశేషం)**




సరికొత్త సరదా శీర్షిక

# వాక్చిత్రం

సుధామ-9849297958



## హాస్య 'గణ-పతు'లు

పురాణ హాస్యం అంటే 'పురానా' హాస్యం కాదుస్మీ! హాస్యం అనేది ఎలా ఉంటుంది అంటే ఎంత కాదనుకున్నా ముందు వేషగత హాస్యం వుంది... తర్వాత చేష్టాగత హాస్యం.

అంచేతే వినాయకుడిని హాస్యానికి అధిదేవత చేసేసి మనం వినాయక చవితికి హాస్య కథల పోటీలు, కార్టూన్ల పోటీలు గట్రా చేసేస్తుంటాం. ఆయన చేటచెవులు, చిన్న కళ్ళు, పెద్ద బొజ్జ, తొండం అన్నిటికీ మించి అంత భారీ దేవుడికి ఎలుక వాహనం... అనేసరికి నవ్వొచ్చేస్తుంది అనే హాస్యాధిపతి అయిపోయాడాయన. అందునా ఉండ్రాళ్లు గట్ల తిని పెద్దలకు పాదాభివందనం చేయబోతే పొట్ట కారణంగా భూమికి తల ఆనితే, కాళ్లు అనక, కాళ్ళు ఆనితే, తలా అనకా ఆ చేష్టాగత స్థితికి చంద్రుడు నవ్వేయడం వల్లనే చంద్రుడికి శాపం కూడా వచ్చింది గానీ...

హాస్యం అంటే వినాయకుడి పేరే వచ్చింది మరి!

**వికృతాకార వాగ్వేష చేష్టాదేర్కుహకార్భవేత్ హాస్యో హాసః స్థాయీ భావః...** అంటూ వేషగతమూ, చేష్టాగతమూ, భాషాగతమూ అయిన వాటి వల్లే హాస్యం పుడుతుందని లాక్షణిక గ్రంథాలు కూడా ఘోషించాయి... కాబట్టే వికృతి ఏదైనా హాస్య ప్రకృతికి మూలమైపోయింది. మన కార్టూన్ అనేది కూడా వ్యంగ్యంగా మామూలుకు భిన్నంగా రేఖాకృతులను సంతరించుకొని భాషాగతమైన క్యాప్షన్ తోనూ హాస్యానందం కలిగిస్తుంటాయి.

వేషంతో, చేష్టలతో నవ్వించడం సులభం అయినంతగా భాషా సంబంధంగా చమత్కారాన్ని సాధించడానికి మేధా సంపత్తి కావాలని మునిమాణిక్యంగారు ఊరికే అనలేదు.

మామూలు కథ రాయడం కన్నా హాస్య కథ రాయడం కష్టం. అలాగే మామూలు బొమ్మ కన్నా నవ్వించే వ్యంగ్య చిత్రం కార్టూన్ వేయాలంటే అది నిజంగా గొప్ప కళ మరి!

వినాయకుడు గణాధిపతే కాదు... హాస్య గణాధిపతి కూడాను. సరస్వతి తర్వాత చదువు సంధ్యల విషయంలో గణపతికే ప్రాముఖ్యం. ఎందుకంటే ఆడుతూ పాడుతూ హాయిగా నవ్వుతూ విద్యాబుద్ధులు నేర్వాలి అనే!

సిద్ధి, బుద్ధి రెండు ప్రసాదించేది గణపతే! 'వెనుకయ్య' అంటాం గానీ...మన వెనుక ఉండి ముందుకు నిర్విఘ్నంగా నడిపించేది ఆయనే మరి!

కవులకు దివ్యదృష్టి హాస్యకర్తలకు వక్రదృష్టి ఉండాలట! హాస్యరచనలో వర్ణనలూ,పాండిత్య ప్రకర్షా గట్రాలు అక్కర్లేదు గాని... ప్రతిభావ్యుత్పత్తులు వున్న వారి వల్లనే ఉత్తమ హాస్యం వస్తుంది. లేకపోతే అది ఏ బూతు హాస్యంగానో అసభ్యమూ పేలవమూ అయిపోతుంది.

అసహజత్వం(Incongruity), ఆశ్చర్యం (Surprise), అసందర్భం(Impropriety), అతిశయోక్తి (Exahgeration) ఇవన్నీ హాస్యం కలిగించేవే. వినాయక రూపులో, కథల్లో ఇవన్నీ ఉండడం వల్లనే ఆయన హాస్యాధిదేవ తయ్యారని మనం చెప్పేయచ్చు.


వినాయక మండపాల్లో ఆధునికంగా ఆయనను ప్రతిష్ఠాపన చేస్తున్న సంవిధానాలు భక్తి ప్రపర్తులకు భిన్నంగా హాస్య స్ఫోరకాలుగా నిలవడం మాత్రం సముచితం కాదేమో విజ్ఞులు ఆలోచించాలి. వినాయకుడికి ప్యాంటు షర్టు వేసి చేతిలో సిగరెట్టుతో మద్యం సీసాతో... కొన్నేళ్ళ క్రితం ఒక వారపత్రిక వినాయక హాస్య సంచిక ముఖచిత్రం కార్టూన్‌గా వేయడంతో ఆ పత్రికా, చిత్రకారుడు కూడా కోర్టు బోనులో నిలబడాల్సి వచ్చిందంటే హాస్యం పేరిట వికటించే వ్యవహారాలు సరికాదని వేరే చెప్పాలా?

అంచేత పురాణహాస్యం సంతరించడం అవసరమే గాని అది మన సంప్రదాయాన్ని భక్తుల మనోభావాలను దెబ్బతీసేవి కాకూడదు.

బాపుగారు, జయదేవ్‌గారు, సరసిగారు వీరంతా పురాణహాస్యం రుచి చూపించినవారే.

అలాంటప్పుడు ఎలాంటి విఘ్నాలు రాకుండా విఘ్నేశ్వరుడే అండగా ఆశీర్వదిస్తాడు. అంచేత వినాయకుడు మెచ్చే హాస్యం విరాజిల్లు గాక! హాస్యానందం గణపతి ఆశీస్సులతో అగణితమై వర్ధిల్లు గాక!

జై బోలో గణపతి పప్పా! మోరియా!



# గోరింటాకు



పసుపులేటి సుధారాణి

**"ఏమండీ! మీరు ఆఫీస్‌కి వెళ్ళిన తరువాత మీకు ఒక రిజిష్టర్డ్ కవర్ వచ్చింది!" అంటూ... అప్పుడే ఆఫీస్ నుండి ఇంటికి వచ్చిన భర్త చేతికి ఒక రిజిష్టర్ కవరు అందించింది శాంతి.**

**'నాకు రిజిష్టర్ కవరా?... ఎక్కణ్ణుంచి వచ్చింది చెప్మా?' అనుకుంటూ కవరు విప్పి చూశాడు రాంబాబు.**

**అది ఒక లాయర్ నోటీసు. తనకు లాయర్ దగ్గర్నుంచి నోటీస్ రావడమేంటి? తను ఏ బ్యాంకులోనూ అప్పులు చేసి ఎగనామం పెట్టలేదు. ఎవరితోనూ గొడవలు పడేవాడు కాదు! మరి ఈ నోటీస్ ఎందుకు వచ్చింది?'**

ఇలా ఆలోచించుకుంటూ కవరు విప్పి అందులో వున్న నోటీసు తీసి ఆసాంతం చదివిన రాంబాబుకి ముచ్చెమటలు పోశాయి.

కొద్దిసేపు నోటమాటరాక చేష్టలుడిగిన వాడిలా వుండిపోయాడు. తర్వాత ఎలాగో తేరుకుని... "శాంతీ!" అంటూ గావుకేక పెట్టాడు.

ఐదు నిమిషాల తర్వాత చేతిలో కాఫీకప్పుతో వయ్యారంగా నడుచుకుంటూ వచ్చింది శాంతి.

"పిలిచారా?" అంటూ అమాయకంగా అడిగింది.

శాంతి అడిగిన తీరుకి చిర్రెత్తుకొచ్చిన రాంబాబు చేతిలోని కాగితం చూపిస్తూ చిరాగ్గా అడిగాడు.

"శాంతీ! ఏమిటిది?"

"పేపరు!" అమాయకంగా చెప్పింది.

"నేనడిగింది ఇది పేపరా?... కర్రముక్కా?... అని కాదు! ఇందులో వున్నది ఏమిటని?" గయ్యిమన్నాడు.

"ఇదేదో లాయర్ నోటీస్‌లా వుందే!" పేపరువైపు ఆరాగా చూస్తూ చెప్పింది శాంతి.

"లాయర్ నోటీస్‌లా కాదు! నోటీసే!! డైవోర్స్ నోటీస్ కూడా!..." పళ్లు కొరుకుతూ అన్నాడు రాంబాబు.

ఒక్క అంగలో రాంబాబుని చేరుకుని ఆ నోటీస్‌ని లాక్కుని కాఫీ కప్పుని రాంబాబు చేతిలో పడేసినట్లుగా పెట్టేసి ఆనందంగా చూస్తూ–

"హాయ్! అప్పుడే వచ్చేసిందా?" అంటూ గిర్రున తిరుగుతూ చప్పట్లు కొట్టింది శాంతి.

శాంతి సంతోషం చూస్తున్న రాంబాబుకి మతిపోయినంత పని యింది.

"అంటే? ఈ విడాకుల నోటీస్ నువ్వే పంపావా?" అయోమయంగా అడిగాడు.

రాంబాబుకేమీ అర్థం కావటంలేదు.

"నేనే..." సత్యభామలా జడను ముందుకు లాక్కుని వయ్యారంగా అటూ యిటూ తిప్పుతూ తాపీగా చెప్పింది.

అవాక్కయిపోయాడు రాంబాబు.


"నువ్వా...?" తేరుకుంటూ అడిగాడు.

"అవును... నేనే!" మరింత చిద్విలాసంగా నవ్వుతూ చెప్పింది.

"ఎందుకే?" గుటకలు మింగుతూ అడిగాడు.

"ఇందుకే..." ఈసారి కంఠంలో కొద్దిగా కోపం ధ్వనించింది.

"ఇందుకే... అంటే?..." ఎందుకో అర్థం కాక వెర్రిమొహం వేసి అడిగాడు రాంబాబు.




"చాలా కారణాలున్నాయి. నెంబర్ వన్– నన్ను 'ఏమే... రావే... పోవే...' అని పిలుస్తారు. అది నాకు నచ్చదు. అని గత పదేళ్లుగా చెప్తున్నాను, వినటంలేదు!" సీరియస్‌గా చెప్పింది.

"అందుకు విడాకులు కావాలా?" ఆశ్చర్యంగా అడిగాడు రాంబాబు.

"కాదు! ఎన్నో పెద్ద పెద్ద విషయాలని చాలా చాలా చిన్న చిన్న విషయాలుగా మార్చేసుకుని సరిపెట్టేసుకున్నాను. ఇక నా వల్ల కాదు మీతో కలిసి కాపురం చేయడం. అందుకే విడాకులు కావాలంటున్నాను!..." తాపీగా ఏమాత్రం కంగారు లేకుండా చక్కగా నెమ్మదిగా చెప్పి వంటగదిలోకి వెళ్లిపోయింది శాంతి.

వెనుకే కూడా కిచెన్‌లోకి వెళ్లాడు రాంబాబు.

"అది కాదు శాంతీ! ఇప్పటికిప్పుడు విడాకులు కావాలంటే ఎలా చెప్పు? సరయిన కారణం వుండాలి కదా!" బుజ్జగిస్తున్నట్లు అడిగాడు.

"నా దగ్గర సరయిన కారణం వుందిగా!" కళ్ళు చక్రాల్లా తిప్పుతూ చెప్పింది.

"ఏంటా సరయిన కారణం?" ఆత్రంగా అడిగాడు.

"ఏ స్త్రీ అయినా ఆస్తులు, అంతస్తులు వున్నా, లేకపోయినా సరిపెట్టుకుని గుట్టుగా కాపురం చేస్తుంది. కాని అసలయినదే లేనప్పుడు ఎంతకాలమని సహిస్తుంది?..." గంభీరంగా ఎటో చూస్తూ చెప్పింది శాంతి.

గతుక్కుమన్నాడు రాంబాబు.

"శాంతీ! ఏం మాట్లాడుతున్నావు నువ్వు? ఎవరయినా వింటే నా గురించి ఏమనుకుంటారు?" కంగారుగా అడిగాడు.

అదీకాక మొన్ననే లక్ష్మీదేవి నెక్లెస్ కావాలంటే మూడు తులాలు పెట్టి చేయించాడు. వెంటనే మేచింగ్ ఇయర్‌రింగ్స్ కావాలంది. చచ్చీచెడి ఎలాగో తిప్పలు పడి అవీ తీసుకున్నాడు. మధ్య మధ్యలో ఏవేవో చిన్న కలహాలు వచ్చినా సర్దుకుపోతుందే కాని ఏనాడూ వదిలి వెళ్ళిపోతాను అనలేదు. అలాంటిది ఇప్పుడు హఠాత్తుగా ఏకంగా విడాకులకి నోటీసు పంపిందంటే ఏ కారణం వుండి వుండాలి. తను ఏ లోటూ లేకుండా చూసుకుంటున్నాడు. ముచ్చటగా సాగిపోతున్న మా సంసారం మీద ఏ దుష్టగ్రహాల కళ్లు పడ్డాయో... ఈ విడాకుల గోల ఏమిటో... ఏమీ అర్థం కాకుండా వుంది..." ఇలా ఆలోచించుకుంటూ ఏ తెల్లవారు ఝామున్కో నిద్రలోకి జారాడు రాంబాబు. గోరింటాకు

✦✦✦




"... మీరు ఏదో ఊహించుకోకండి. నేను చెప్పింది మీకు నా మీద ప్రేమ లేదని. అందుకే ఇక భరించడం నాకు సాధ్యంకాదు... విడాకులు తథ్యం!" నా నిర్ణయానికి తిరుగులేదు అన్నట్లు చేతిలోని గరిటెని ఠపీమని గిన్నెపై కొట్టింది శాంతి.

ఉసూరుమంటూ వెనక్కి తిరిగి హాల్లోకి వచ్చాడు రాంబాబు.

✦✦✦

రాత్రంతా నిద్రలేకుండా ఆలోచిస్తూనే వున్నాడు రాంబాబు.

మనసు పరిపరివిధాల పోతోంది. శాంతిపై తనకు ప్రేమ లేదా? ప్రేమ లేకపోతే సంవత్సరానికి నాలుగు పట్టుచీరలు, రోజువారీ అంటూ ఎనిమిదికి తక్కువ కాకుండా మామూలు చీరలు ఎలా కొంటున్నాను.

"శాంతీ!" అంటూ నెమ్మదిగా పిలిచాడు.


ఉదయమే టిఫిన్ సిద్ధం చేస్తున్న శాంతి తలతిప్పి చూసింది ఏమిటన్నట్లుగా.

"శాంతీ! మరేం లేదు...నాదొక చిన్న అనుమానం. అది తీర్చేశావంటే రేపే విడాకులు తీసేసుకోవచ్చు!" ఏమంటావ్ అన్నట్లుగా చూశాడు.

"ఏమిటో ఆ అనుమానం. అడగండి, తీర్చేస్తాను!" సాగదీసుకుంటూ అడిగింది శాంతి.

"నీమాద నాకు ప్రేమ లేదని నీకెలా తెలిసింది? నీకే అలా అన్పించిందా? లేక ఎవరయినా చెప్పారా నీకు?" ఆరాగా అడిగాడు.

"నాకు ఎవరో చెప్తేకాని తెలుసుకోలేనంత చిన్నపిల్లని కాదు. నేనే




తెలుసుకున్నాను" గర్వంగా చూస్తూ చెప్పింది.

"ఎలా తెలుసుకున్నావు బుజ్జితల్లీ?" వెటకారం కనబడనీయకుండా జాగ్రత్తపడుతూ అన్నాడు.

"సింపుల్! ఆషాఢమాసంలో తప్పనిసరిగా గోరింటాకు పెట్టుకోవాలని అంటారు... అందుకే మొన్న గోరింటాకు తెచ్చి రుబ్బి పెట్టుకున్నాను. ఎప్పుడూ ఎర్రగా పండే నా చేతులు మొన్న గోరింటాకు పెట్టుకున్నప్పుడు చూడండి! ఎలా లేతపసుపురంగులో పండాయో?... గోరింటాకు ఎర్రగా పండితే భర్తకు భార్యపై ప్రేమ వున్నట్లు. పండకపోతే లేనట్లు అని చిన్నప్పుడు మా నాన్నమ్మ చెప్పేది. పోయిన సంవత్సరం వరకు బాగానే పండింది. ఈ సంవత్సరమే యిలా పండింది. అంటే మీకు నామీద ప్రేమ తగ్గిపోయిందనే కదా అర్థం! ఈవాళ తగ్గిపోయింది, రేపు అసలు వుండదు. అందుకనే మనసు రాయి చేసుకుని ముందుజాగ్రత్త తీసుకుంటున్నాను. ప్రేమ లేని చోట ఈ శాంతి ఒక్కక్షణం కూడా వుండ లేదు!" కొనగోటితో కన్నీళ్ళు తుడుచుకుంటూ చెప్పింది శాంతి.

'ఔరా! గోరింటాకు తెచ్చిన తంటానా ఇది! గోరింటాకు పండకపోతే భర్తకి భార్యమీద ప్రేమ లేనట్లేనా?' అనుకుంటూ...

"సరే కానీ శాంతీ! నువ్వు గోరింటాకు ఎవరి చెట్టుది కోసుకొచ్చి రుబ్బి పెట్టుకున్నావు?" అడిగాడు.


"పార్వతమ్మగారి చెట్టుది!" అయితే ఏమిట న్నట్లుగా అనుమానంగా చూసింది.

"అదీ సంగతి! నువ్వు ఎప్పుడూ కాంతమ్మగారి గోరింటాకు చెట్టు ఆకు కోసుకొచ్చి రుబ్బి పెట్టుకుంటావు. అది ఎర్రగా పండేది. పార్వతమ్మగారి చెట్టు ఆకు ఎప్పుడూ కోసుకోలేదు నువ్వు. అందుకే విషయం నీకు తెలియదు... ఆ చెట్టు ఆకు సరిగా పండదని ఎవరూ దానిని కోసుకోరు. అందుకే దాని నిండా ఆకు వుంది. అది నీకు కనిపించేసరికి నువ్వు సంబరంతో కోసుకొచ్చుకుని పెట్టుకున్నావు... అది పండ లేదు. అంతేకాని, నాకు నీమీద ప్రేమ తగ్గిపోయి కాదు! భర్తకు భార్యపై వుండే ప్రేమకు కొలమానం గోరింటాకు మాత్రమే కాదు. అది ఒక ఆచారం మాత్రమే!" అంటూ చిద్విలాసంగా నవ్వుతూ గీతోపదేశం చేస్తున్న రాంబాబుని... "అవునా..." అన్నట్లు పరమ శాంతంగా చూసింది శాంతి.


## నవ్వించే 244 కార్టూన్లతో కొత్త పుస్తకం!

నవ్వించే, ఆలోచింప జేసే సందేశాత్మక కార్టూన్ల సమాహారం
ఈ కార్టూన్ల సంకలనం! తప్పక సొంతం చేసుకోండి
పుస్తకం విలువ 150 రూపాయలు మాత్రమే!

ఈ పుస్తకం కావలసినవారు 7416440895 నెంబరుకి
150 రూపాయలు ఫోన్ పే / గూగుల్ పే చేయండి!
వాట్సాప్‌లో మీ అడ్రస్ పంపండి!



## 'బెస్ట్ న్యూస్ పేపర్ కార్టూన్' అవార్డు గ్రహీత- శ్రీసుభాని

నిరంతర శ్రమతో తెలుగు కార్టూన్ చరిత్రలోనే కాదు అంతర్జాతీయ స్థాయిలో కూడా అందరికీ ఆదర్శ ప్రాయంగా నిలిచిన కృషీ వలుదు **శ్రీ సుభానిగారు.**
ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుండి **'బెస్ట్ న్యూస్ పేపర్ కార్టూన్'** అవార్డు అందుకున్న సందర్భంగా హాస్యానందం అభినందనలు.
పొలిటికల్ కార్టూన్ రంగంలో రాణించటం ఆషామాషి వ్యవహారం కాదు. ఇది సమాజం పట్ల అవగాహనతో కూడిన ఒక బాధ్యత.
మనకుండే కొద్దిమంది పొలిటికల్ కార్టూనిస్టులో ప్రముఖులు శ్రీ సుభానిగారు. ప్రతిష్ఠాత్మకమైన **'బెస్ట్ న్యూస్ పేపర్ కార్టూన్'** అవార్డు అందుకున్న సందర్భంగా మన కార్టూనిస్టులు శ్రీ సుభానిగారికి హైదరాబాద్ లో అభినందన సభ ఏర్పరచి 'ఆత్మీయ సత్కారం' చేయటం అభినందనీయం!






ప్రఖ్యాత జర్నలిస్టు శ్రీ రామ్ బహద్దూర్ రాయ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీ సుభాని.




## 38 హాస్య కథల సంకలనం హాస్యానందం

ప్రముఖ హాస్యకథా రచయిత గంగాధర్ వడ్లమన్నాటి సంకలనకర్తగా, ముప్పై ఎనిమిది మంది రచయితల/రచయిత్రుల హాస్యకథలతో రూపొందించిన సంకలనం హాస్యానందం.

ఈ సంకలనం ఆగష్టు పదవ తారీఖున, విశాఖ పబ్లిక్ లైబ్రరీలో హాస్యానందం సంపాదకులు శ్రీరాము గారు ఆవిష్కరించారు. మొదటి ప్రతి ద్విభాష్యం రాజేశ్వరరావుగారు అందుకున్నారు.

ఇందులో ప్రఖ్యాత కథకుల నుండీ, ఇప్పుడిప్పుడే పేరు తెచ్చుకుంటున్న కథకుల వరకూ ఉన్నారు. ఈ సంకలనంలో ఏ హాస్య కథకి ఆ హాస్యకథే ప్రత్యేకంగా నిలుస్తుంది. ఇన్ని భిన్నమైన కథాంశాలతో రూపొందిన ఈ సంకలనం, పాఠకులకి మంచి అనుభూతి నిస్తుందనడంలో సందేహం లేదు.

తెలుగులో హాస్య కథా సంకలనాలు చాలా




తక్కువగా విడుదలవుతాయి. ఈ ప్రయత్నం అభినందించదగ్గది.

సంకలనంలో హాస్య కథల విషయానికి వస్తే, అన్ని కథలూ మన చుట్టూ జరిగేవీ, జరుగుతున్నవిగానే అనిపిస్తాయి. హాస్య ప్రియులని ఈ కథల సంపుటి అలరిస్తుందనడంలో ఏఅ మాత్రం సందేహం లేదు.

బాలిగారి ముఖచిత్రంతో వచ్చిన ఈ పుస్తక ముద్రణా, పేజీ క్వాలిటీ బావున్నాయి. మొత్తంగా చక్కగా చదివి ఆనందించదగ్గ మంచి హాస్యకథా సంకలనం ఇది.

**వెల:** 250 రూపాయిలు(రిజిష్టర్ పోస్ట్ చార్జీలతో కలిపి).


**ప్రతులకు:** గంగాధర్ వడ్లమన్నాటి,
10-385/1/88, వెటర్నరీ కాలనీ,
విశాలాక్షినగర్,
విశాఖపట్నం-530043
ఫోన్ పే/గూగుల్ పే/పే టి.యం :
**9908445969** (మీ చిరునామాతో పాటు పంపిన రిసీప్ట్ పెట్టగలరు)

# నవ్వులాట

గాంధీ మనోహర్, 98490 51846

## స్నేహమంటే ఇదేనా మిత్రమా?

**జ**గ్గయ్య, దేవదాసుల గురించి దిల్సే కాలనీలో ఎవర్ని అడిగినా... వాళ్ళు 'బెస్ట్ ఫ్రెండ్స్ అనీ, బోసం ఫ్రెండ్స్' అనీ తడుము కోకుండా చెబుతారు. వాళ్ళ కులాలు వేరైనా, ప్రాంతాలు వేరైనా అది వాళ్ళ స్నేహానికి ఎటువంటి అంతరాయం కలగలేదు.




సింగిల్ సెంటన్స్‌లో చెప్పాలంటే వాళ్ళది అరమరికలు లేని అనుబంధం. స్వచ్ఛత, స్వార్థం, దాపరికం లేని వాళ్ళ మైత్రి గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇక వీళ్ళ ఫ్రెండు షిప్పు ఎలివేషన్స్ ఆపి కథలోకి వెళ్దాం.

జగ్గయ్య, దేవదాసు చిన్ననాటి ఫ్రెండ్స్ కాదు. ఇద్దరూ ఒకే ఆఫీస్‌లో కూడా కలిసి పని చేయలేదు. జస్ట్ మూడేండ్ల క్రితం వీళ్ళ స్నేహానికి అంకురార్పణ జరిగింది.

రిటైర్డ్ అయిన జగ్గయ్య దిల్సే కాలనీలో వున్న నాథూరాం గాడ్సే పార్క్‌కి మార్నింగ్ వాక్‌కి వెళ్ళేవాడు. అక్కడ దేవదాసు పరిచయం అయ్యాడు. ఆయన కూడా రిటైర్డ్ అవడం వల్ల ఇద్దరూ ఫుల్ ఖాళీ వుండేవాళ్ళు. దాంతో వాళ్ళ ఫ్రెండ్‌షిప్ డెవలప్‌మెంట్ కోసం మేజర్ టైం కేటాయించే వాళ్ళు. అందు మూలంగా అనతి కాలంలోనే వీళ్ళ స్నేహశీలత నీళ్ళతో కలిపిన ఇసుకా సిమెంట్‌లా గట్టిగా బలపడింది.

ఇలా వాళ్ళ ఫ్రెండ్‌షిప్ ఎడతెరిపి లేకుండా కొనసాగుతుండగా, ఒకరోజు జగ్గయ్య ఇంటికి దేవదాసు వచ్చాడు. జగ్గయ్యకు దేవదాసు ఐదు లక్షలు ఇస్తూ– "జగ్గూ! ఈ ఐదు లక్షలు నీ దగ్గర ఉంచు... ఇది నేను దాచుకున్నది. దీని సంగతి నా కొడుకుకుగానీ కోడలికిగానీ తెలీదు. నాకు ఎప్పుడైనా బాగాలేక హాస్పిటల్లో వున్న ప్పుడు నిన్ను అడుగుతాను. అప్పటి వరకు నీ దగ్గర ఉంచు!" అని అన్నాడు.

ఈ సంఘటన జరిగిన కొన్ని రోజులకు... రాత్రి పదిగంటలప్పుడు దేవదాసుకు గుండెల్లో నొప్పిగా వుందని అన్నాడు.

దాంతో దేవదాసును ఆయన కొడుకు శరత్ హుటాహుటినా హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. కానీ తెల్లవారు జామున దేవదాసు ఈ లోకాన్ని వదిలిపోయాడు.

ఈ దుర్వార్త జగ్గయ్యకు చేరింది.

దేవదాసు ఇంటికి వెళ్ళి ఆయన పార్థీవ దేహం పక్కన నిలబడి బహిరంగంగా బాధ పడ్డాడు. తదనంతరం దేవదాసుతో తన అను బంధాన్ని, జ్ఞాపకాల్ని అక్కడ ఉన్నవాళ్ళతో పంచుకుని కన్నీళ్లు కూడా కార్చాడు.

అంత్యక్రియలు ముగిసే వరకు అక్కడే వుండీ ఇంటికి వెళ్ళబోతూ... దేవదాసు కొడుకుకి ధైర్యం చెప్తూ– "శరత్! నువ్వు నాకు కొడుకులాంటి వాడివి... ఏదైనా అవసరం వున్నప్పుడు అర్ధరాత్రి పూటైనా అడుగు! మొహమాటపడవద్దు!" అని భుజం తట్టి మరీ... చెప్పాడు జగ్గయ్య.

ఆయన అభిమానానికి ఆత్మీయంగా జగ్గయ్యను హగ్ చేసుకున్నాడు శరత్.

జగ్గయ్య తన ఇంట్లో పడుకుని ఆలోచిస్తూ వున్నాడు.

దేవదాసు తనకి ఐదులక్షలు ఇచ్చిన సంగతి తన కొడుకుతో చెప్పాడా... లేదా?... ఒకవేళ చెప్పుంటే తను ఈ పాటికే నన్ను అడిగేవాడు కదా? అలాంటి వాతావరణంలో అడగడం ఇష్టం లేక తర్వాత అడుగుదాం అని మానేశాడా? లేక దేవదాసు ఆ డబ్బు విషయం తన కొడుకుతో చెప్పనే లేదా? గుండె పోటుతో బాధపడుతూ ఆ విషయం గ్యారంటీగా తన కొడుకుతో చెప్పి వుండడు... దేవుడి దయవల్ల చెప్పుండక పోతే ఆ ఐదు లక్షలు అప్పనంగా తన స్వంతం అయిపోతాయి.

ఇలా పరి పరి విధాలుగా ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాడు జగ్గయ్య.

ప్రొద్దున్నే లేచి స్నానం చేసి వచ్చి... తన మొబైల్ చూశాడు జగయ్య. శరత్ నుండి రెండు మిస్డ్ కాల్స్ వున్నాయి. డబ్బు గురించి అడగడానికి చేసుంటాడా...లేక వేరే విషయం ఏమైనా అడగడానికి చేశాడా? అని ఆలోచిస్తూ వుండగా టెన్షన్‌తో చలికి కూడా జగ్గయ్య ఒళ్ళంతా చెమట పట్టేసింది.

మళ్ళీ ఇంతలో శరత్ ఫోన్ చేశాడు.

"దేవుడా! ఐదు లక్షలు గురించి అడక్కుండా చూడు స్వామీ!" అని మనసులోనే దేవుడికి మొక్కుకుంటూ ఫోన్ లిఫ్ట్ చేశాడు జగ్గయ్య.

"అంకుల్! నాన్న మీకేమైనా..." అని ఏదో

అడగబోతుండగా కాల్ కట్ అయింది.

దాంతో జగ్గయ్య గుండె గుబేల్ మంది.

శరత్‌కు కాల్‌బ్యాక్ చేయడానికి మనసొప్పక ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ ఉండిపోయాడు జగ్గయ్య.

మళ్ళీ ఇంతలో శరత్ కాల్ చేశాడు.

టెన్షన్ పడుతూ లిఫ్ట్ చేశాడు జగ్గయ్య.

"సారీ అంకుల్! కాల్ కట్టి అయింది." అని,

"అంకుల్!... పోయిన్నెల తిరుపతిలో డాడీ తీయించుకున్న ఫోటోలు మీకేమైనా సెండ్ చేశాడా?" అని అడిగాడు శరత్.

"లేదు శరత్!" అని అన్నాడు జగ్గయ్య.

"సరే అంకుల్! ఆ ఫోటోలు ఒక్కటి కూడా డాడీ ఫోన్‌లో లేవు. మీ దగ్గర ఏమైనా ఉన్నాయే మోనని చేశాను!" కాల్ కట్ చేశాడు శరత్.

పోయిన ఐదు లక్షలు దొరికినట్టు ఫీల్ అయ్యాడు జగ్గయ్య.

✦✦✦

ఐదు లక్షలతో ఏమి కొనాలో... పార్క్‌లో కూర్చోని లెక్కలు వేసుకుంటున్నాడు జగ్గయ్య.


ఇంతలో జగ్గయ్య, దేవదాసుల కామన్ ఫ్రెండ్ రాజానంద్ వచ్చాడు.

కాసేపు ఇద్దరూ మాట్లాడుకున్న తర్వాత ...

"ఆ ఐదు లక్షల్లో ఇప్పటివరకు ఎంత ఖర్చు పెట్టావ్ బ్రో?" అని కేజువల్‌గా అడిగాడు రాజానంద్.

ఆ మాటతో ఉలిక్కి పడ్డాడు జగ్గయ్య.

కాసేపు తర్వాత తేరుకుని... "ఏ ఐదు లక్షలు?" అని ఏమీ తెలీనట్టు అన్నాడు.




"ఎందుకు తెలీనట్టు నటిస్తావ్! దేవానంద్ నీకు ఐదు లక్షలు ఇచ్చిన సంగతి నాకు తెల్సు!" అని... "అందులో రెండన్నర లక్షలు ఇస్తే ఈ మ్యాటర్‌ని నాలోనే శాశ్వతంగా దాచుకుంటా!" అని అది పార్క్ అనే స్పృహ లేకుండా సిగరెట్ వెలిగించాడు రాజానంద్.

రాజానంద్, జగ్గయ్యల మధ్య ఆర్గ్యూమెంట్ కాసేపు కొనసాగింది.

చివరికి డీల్ కుదిరి రాజానంద్‌కు రెండు లక్షలు ఇచ్చేట్టు జగ్గయ్య ఒప్పుకున్నాడు.

మరుసటి రోజు జగ్గయ్య ఇంటికి రాజానంద్ వచ్చి డబ్బు పట్టుకుపోయాడు.

ఓ పదిహేను రోజుల తర్వాత అనుకో కుండా జగ్గయ్యకు శరత్ మార్కెట్‌లో తారస పడ్డాడు. ఇద్దరూ కాసేపు మాట్లాడుకుని డిస్పర్స్ అయ్యారు. ఈ ఇన్సిడెంట్ తర్వాత దేవానంద్ ఐదు లక్షల సంగతి శరత్ కు చెప్పినట్టు లేదని డౌట్‌లెస్‌గా కన్ఫం చేసుకున్నాడు జగ్గయ్య.

ఎన్నో రోజులుగా తను కొనాలనుకుని కొన లేకపోయిన లగ్జరీ ఐటమ్స్ అన్నీ ఆ మూడు లక్షలు పెట్టి కొనేశాడు జగ్గయ్య. వాటితో ఎంజాయ్ చేస్తూ శేషజీవితాన్ని గడిపేస్తున్నాడు.


వన్ ఫైన్ డే పొద్దున్నే రిలాక్స్‌డ్‌గా కూర్చోని కాఫీ తాగుతున్నాడు జగ్గయ్య .

ఇంతలో తన ఫోన్ రింగ్ అయింది. కాల్ చేస్తున్నది శరత్.

చాలా రోజుల తర్వాత కాల్ చేస్తున్నందుకు భయపడుతూనే లిఫ్ట్ చేశాడు జగ్గయ్య.

"గుడ్ మార్నింగ్ అంకుల్! డాడీకి హార్ట్ ఎటాక్ వచ్చి హాస్పిటల్లో వున్నప్పుడు మీకు ఐదు లక్షలు ఇచ్చినట్టు నాతో చెప్పాడు. మీ అంతట మీరే ఇస్తారని ఇన్ని రోజులు ఆగాను. నాకిప్పుడు ఆ ఐదు లక్షలు అవసరం వుంది. రేపు మీ ఇంటికొచ్చి తీసుకుంటాను... ఇలా అడిగినందుకు... మరోలా అనుకోకండి అంకుల్!" అని పొలైట్ ప్లస్ వార్నింగ్‌ని కల గలిపి అడిగినట్టుగా అన్నాడు.

దానికి ఏ సమాధానం చెప్పకుండా సైలెంట్ గా వున్నాడు జగ్గయ్య. తన చేతిలో వున్న కాఫీ కప్పు జారిపోయి తన మీద పడి కాలినా దానికి ఎటువంటి రియాక్షనూ లేదు. అంతేకాకుండా తన చేతిలో వున్న ఐ ఫోన్ జారి కింద పడి బద్దలైంది. దానికీ ఎటువంటి ప్రతిస్పందన లేదు. ఏదో ట్రాన్స్‌లో వున్నట్టు అలా ఉండి పోయాడు జగ్గయ్య.






మన తెలుగు కార్టూనిస్టుల వైభవాన్ని పరిచయం చేస్తున్న శీర్షిక! 9

## రామ్‌శేష


**పు**ట్టి పెరిగింది నెల్లూరులో. అమ్మ,నాన్నలు శ్రీమతి లక్ష్మి, శ్రీ మోపూరు పెంచల నాయుడు, భార్య ప్రశాంతి, కూతురు, భావన, అన్నలు: మోపూరు పెంచల నరసింహం, మోపూరు శ్రీనివాసులు.


చిన్నప్పటినుండి నాకు డ్రాయింగ్ అంటే ఆసక్తి. నా ఆసక్తిని గుర్తించిన మా నాన్నగారు డ్రాయింగ్ మాస్టర్ శ్రీసాయిబాబాగారి డ్రాయింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో జాయిన్ చేసారు. అలా డ్రాయింగ్‌లో హయ్యర్, లోయర్ టీటీసి చేసాను. 1997లో హార్ట్ యానిమేషన్ అకాడమీలో జాయిన్ అయ్యాను. అలా యానిమాటర్‌గా నా కెరీర్ మొదలైంది. అటు తర్వాత Colorchips india Pvt Ltd లో పనిచేసేటప్పుడు శ్రీజయదేవ్ బాబుగారి సలహాలు నాకు లభించాయి. 1993లో మయూరి వార పత్రికలో నా మొదటి కార్టూన్ ప్రచురించబడింది. ఇప్పటివరకు 5000 పై చిలుకు కార్టూన్స్ అన్ని వార, పక్ష, మాస పత్రికలలో ప్రచురించబడ్డాయి. హాస్యానందం, గోతెలుగు.కామ్ వెబ్ పత్రికలలో కార్టూన్ శీర్షికలు నిర్వహించాను. పిల్లల కోసం అనేక బొమ్మల కథలు 'కామిక్స్' వేసాను. 25కిపైగా కథలు ప్రచురించబడ్డాయి.

డ్రాయింగ్ పట్ల నా ఆసక్తిని గమనించి, ప్రోత్సాహాన్ని ఇచ్చిన మా నాన్న గారి పేరు మీద 2005 నుండి 2008 వరకు హాస్యానందం మాస పత్రికలో కార్టూన్ పోటీని నిర్వహించాను. ఆంధ్రప్రదేశ్ అకాడెమి ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ వారికి పుస్తకాల కొన్నింటికి బొమ్మలు వేసాను. అలాగే వయోజన విద్య కేంద్రం వారి కొన్ని పాఠ్యాంశాలకు బొమ్మలు వేసాను.

తొలి తెలుగు కార్టూనిస్ట్ శ్రీ తలిశెట్టి రామారావు గారి పేరు మీద 2012,13,14,15,16,17,18,21,23లలో వరసగా విశిష్ట, ద్వితీయ, ప్రథమ, ద్వితీయ, ద్వితీయ, విశిష్ట, తృతీయ భాహుమతులు లభించాయి. 2018లో బాపు-రమణ గారి అవార్డు లభించింది. ప్రభుత్వ,ప్రైవేటు సంస్థలు నిర్వహించిన పోటీలలో అనేక బహుమతులు లభించాయి.


మా టీవిలో ప్రసారం అయిన నా మొదటి షార్ట్ ఫిలింకి ప్రముఖ దర్శకులు శ్రీరాఘవేంద్రరావుగారి చేతుల మీదుగా ప్రశంసలు పొందడం మరువలేని అనుభూతిని ఇచ్చింది.



















మనం ఆడపిల్లలపై అత్యాచారాలు చెయ్యలేదు.
ఆడపిల్లలను కట్నాల కోసం చంపలేదు. మరి ఈ నాగరికులు
మనది 'రాతియుగం' అంటారేంది మామా?...
రాతి యుగం
రామకృష్ణ..



కార్పొ'రేట్' హాస్పిటల్
మీ అవయవాలకు మేమే భాధ్యులు
రామకృష్ణ..



పట్టణాల్లో ప్లాస్టిక్ తినే నాకు..
ఈ గడ్డి అరుగుతుందంటావా?..
ప్లాస్టిక్ పై నిషేధం
రామకృష్ణ..


"గంగి గోవు పాలు గరిటెడైనా చాలు" అనే
పద్యాన్ని 'దీని' ముందు చదవాలని నీకు
ఎన్నిసార్లు చెప్పాలి.
రామకృష్ణ..


కొర్రలు తినాలా... అన్నం తినాలా.
తెలియట్లేదోయ్..!!
ఏమైనా నాలాగ
ఒక్క పూట తినండ్సార్..!!
రామకృష్ణ..


తాగి లేట్ గా వచ్చానని
నన్ను తన్నినా సరే...
ఈ రోజు నువ్వు
'చాలా అందంగా' వున్నావు...
రామకృష్ణ..


పొరపాటున ఈ షటిల్ ఆడే వాడి దగ్గరికే వచ్చాను..
ఆటలో వాడి షటిల్ "కాక్" పోయినప్పుడల్లా..
ఇలా నా ఈకలతో..!!!
రామకృష్ణ..


అబ్బాయికి అమెరికాలో శెలవల్లేవంటూ!
కొరియర్లో 'కొరివి' పంపాడు
రామకృష్ణ..




గంగాధర్ వడ్లమన్నాటి- 9908445969

## అద్భుతం జరిగిందోచ్!

**"అమ్మా!" అని ఓ క్షణం చూపుడు వేలి గోరు కొరుక్కుని...**

**"నేను వెనక్కి వెళ్ళాలనుకుంటున్నాను. నువ్వేవంటావ్?" అడిగింది మళ్ళీ గోరు కొరుక్కుంటూ.**


**"వద్దు! దయచేసి అలాంటి మొద్దు పనులు మాత్రం చేయద్దు! వెనక్కి వెళితే మెట్లున్నాయి... పడితే పనసకాయలా దొర్లిపోయి... తల బొప్పి కడుతుంది!" చెప్పింది చేయి పట్టుకుని కొంచెం ముందుకు లాగుతూ.**

"అబ్బా... అమ్మా! వెనక్కి అంటే ఈ వెనక్కి కాదు. జీవితంలో వెనక్కి!" చెప్పింది అసహనంగా హాల్లోకి నడిచి, సోఫాలో కూర్చుంటూ.

"జీవితంలో వెనక్కా?! అసలే ఆర్థరైటిస్‌తో బాధ పడుతున్నదాన్ని... ఈ మధ్యే ఆరోగ్యం సర్దుకుని ఇలా ఉంటున్నాను. నీ అర్థం లేని మాటలతో... నన్ను అర్థాయుష్షుతో చంపే ప్రయత్నం చేయకుండా... ఏ విషయంలో వెనక్కో సూటిగా చెప్పి అఘోరిస్తే, ఆనందించి అఘోరిస్తాను!" చెప్పింది తల్లి.

"మధునే మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను!" చెప్పింది లలిత తెగ సిగ్గుపడిపోతూ.

ఆ మాట వింటూనే మొదట తుళ్ళిపడి, తర్వాత గిల్లి చూసుకుని... "సిల్లీగా మాట్లాడకు, నీకేమైనా పిచ్చిపట్టిందా ఏవిటి? అవతల ఆ శేఖర్ నచ్చాడంటేనే కదా మనం వాళ్ళతో నిశ్చితార్థం కూడా చేసుకున్నాం. పైగా అవతల పెళ్ళి ముహూర్తం ముందుకు వచ్చేస్తుంటే...



నువ్వు ఇలా వెనక్కి వెళ్ళి, విడాకులు ఇచ్చిన వాడినే మళ్ళీ పెళ్ళి చేసుకుంటానంటావా? అవ్వ! అవ్వ!! ఎవరైనా వింటే ముక్కుతో నవ్వి, చెవులు కొరుక్కుంటారు. అయినా శేఖర్ నీ ఫ్లాష్‌బ్యాక్ తెలిసి కూడా బ్యాక్ స్టెప్ వేయకుండా, నీకు జీవితాంతం బ్యాక్ బోన్‌లా నిలబడతానని ముందుకు వచ్చాడు. ఇపుడు ఇది తెలిస్తే మొహం రోస్ట్ చేసుకుంటాడు. కనుక వేస్ట్ ఆలోచనలు మానుకుని బెస్ట్ డెషిషన్ తీసుకో!" లలిత గడ్డం పట్టుకుని చెప్పింది తల్లి.

"ఆ శేఖర్ నా వెనక జాస్తిగా ఉన్న ఆస్తిని చూసి, నా మెళ్ళో పుస్తె కట్టడానికి ఒప్పుకున్నాడేమోనని కూస్తంత అనుమానంతో కుస్తీ పడుతున్నాను. ఎందుకంటే, ఎప్పుడు ఫోన్ చేసినా, మీ ఇల్లు పెద్దదే, బావుంది, ఎన్ని గజాలు, మీ నాన్నగారి వయసు కనిపించదు, నీ పెద్దన్నయ్యలా ఉంటారు, ఆయన ఎప్పుడు రిటైర్ అవుతారు. నీకున్న నగలన్నీ అలంకరించుకుని ఓ ఫోటో తీసి పంపు చూడాలని ఉంది. పెళ్ళి గ్రాండ్‌గా చేస్తారా లాంటి ప్రశ్నలతో నా దగ్గర అతి తెలివి ప్రదర్శనలు చేసి, కూపీ లాగే ప్రయత్నం చేస్తున్నాడు దరిద్రుడు!" చెప్పింది లలిత విసుగ్గా.

"పోనీలే... ఈ రోజుల్లో పిల్లలకి ఆస్తులమీద ఆమాత్రం ఆత్రం సహజం... నువ్వు అదేదో బూతైనట్టు, దాన్ని బూతద్దంలో చూసి, మనసుకి కోత పెట్టుకోకు. పైగా, గతంలో మధు, తను మాత్రమే ఫుడ్ ఆర్డర్ పెట్టుకుని పీకల దాకా తినేవాడనీ, ఎప్పుడు పడితే అప్పుడు ఫ్రెండ్స్‌ని ఇంటికి పిలిచి కిట్టీ పార్టీల పేరుతో ఇల్లంతా సంత చేసేవాడనీ, ప్రతి మాటకీ వాదనకి దిగేవాడనీ, పడుకుంటే పెద్ద సౌండుతో ఫోన్ చూసేవాడనీ, అలా మర్చిపోలేని విధంగా చాలా రకాలుగా నిన్ను మార్చి మార్చి ఓర్చుకోలేని విధంగా టార్చర్ పెట్టాడనీ చెప్పావ్. నీ జీవితం అనే కథకి కథానాయకుడౌతాడనుకున్నవాడు... అతిథి పాత్రలా వచ్చి వెళ్ళిపోయాడు... మళ్ళీ ఆ పాత్రని ఆహ్వానిస్తానంటున్నావ్! ఈసారి గానీ వాడు నీ పాలిట ప్రతి నాయకుడైపోతే... నీ కథ కంచికెళ్ళిపోతుంది....

కనుక నీ జీవితంలోకి మళ్ళీ వాడి రీ ఎంట్రీ

వద్దు, గతం గతః మర్చిపో!” నచ్చ చెప్పింది తల్లి.

“అసలు విషయం ఏంటంటే, వాడు నన్ను టార్చర్ పెట్టడం కాదు… నేనే వాడ్ని టార్చర్ పెట్టాను… తప్పు నాదే… అంటే మీరు నాకు వత్తాసు పలకరని, బత్తాయి రసం తాగినంత తేలిగ్గా కొన్ని కల్పించీ, కొత్తవి పుట్టించి, లేనివి చొప్పించీ, నేను చెబితే నమ్మరనుకున్నవి వేరే వారితో చెప్పించీ, మిమ్మల్ని మా విడాకులకి ఒప్పించాను!” చెప్పింది లలిత.

“ఓసి నీ దుంప తెగ! మమ్మల్ని ఇంత దగా చేసావా? పోన్లే అతనికీ నీకూ కుదరలేదు. దాంతో మీ మధ్య బంధం ముదరలేదు, వదిలేయ్! అతనూ వేరే సంబంధాలు చూసుకుంటున్నాడు. ఈ సారి మంచి అమ్మాయి దొరుకుతుందిలే…” అని నాలుక్కరుచుకుంది.

“ఆ అమ్మాయి నేనే అవుతాను. ఎందుకంటే, కొన్ని మంచి గుణాలు కలుపుకున్నాను… అహం, గర్వం తీసివేసాను, సానుకూల ధృక్పథాన్ని గుణకారం చేసి, నన్ను నేను భాధ్యతలతో భాగించుకుని, ఉత్తమ వనితగా మార్చుకున్నాను.” గట్టిగా చెప్పింది లలిత

“ఇది జడ కొప్పో, మేకప్పో కాదు… ఎప్పుడు పడితే అపుడు, ఎలా పడితే అలా ముడేసుకోడానికీ, మార్చేసుకోవడానికీనూ. ఇది జీవితం! వెనక్కి వెళ్ళాలనే నీ ఆలోచనే తప్పు!…


ఒప్పో ముప్పో, ఎప్పుడూ ముందుకే వెళ్ళిపోవాలి, కనుక ఈ సంబంధం చేసుకో. పైగా మీరిద్దరూ విడాకులు తీసుకుని విడిపోయి ఆరు నెలలైపోయింది. నిన్ను ఈ పాటికే అతను మర్చిపోయి ఉంటాడు”.

“అపశకునం మాట్లాడకమ్మా! ఒకసారి వాళ్ళ అమ్మకి ఫోన్ చేసి, ఇలా అని చెప్పు ఏమంటారో చూద్దాం!…” సలహా ఇచ్చింది లలిత.

“అదేదో నువ్వే చేయరాదూ?” అంది తల్లి బ్రతిమాలుతున్నట్టు.

“అదెప్పుడో చేసాను!… మధు దూరం అయ్యాకే తన విలువ తెలిసిందనీ, నా తప్పులు గ్రహించాననీ, ఆగ్రహం విడిచి నన్ను అనుగ్రహించి, మరోసారి మా పాణిగ్రహణం జరిపించి, మమ్మల్ని ఒకటి చేయాలని మెసేజుల మీద మెసేజులు పెట్టాను…

బోల్డుసార్లు కాల్స్ చేసాను… రిప్లయ్ ఇవ్వకుండా నంబర్ బ్లాక్ చేసి పడేసారు. అందుకే నిన్ను చేయమనేది.” మూతి బిగిస్తూ చెప్పింది.



ఆ మాట వింటూనే– “వామ్మో!… నా వల్ల కాదు. నీ మాటలు నమ్మి… వాళ్ళని నానా మాటలూ అన్నాను. మీ నాన్న ఓ అడుగు ముందుకు వేసి, అతన్ని కాలర్ పట్టుకుని మరీ కూలర్‌కేసి గుద్దాడు! ఇప్పుడు గానీ వాళ్ళకి ఫోన్ చేసానంటే, నన్ను కోన్‌కిస్కాలా చూసి, నానా తిట్లూ తిడతారు… ఏదైనా అద్భుతం జరిగి వాళ్ళంతట వాళ్ళు ముందుకు వస్తే తప్ప, నువ్వన్నది సాధ్యం కాదు. కనుక మంచో చెడో ముందుకే వెళ్ళు. లేదంటే రెంటికీ చెడి, ఎడారిలో ఒంటెలా ఒంటరిగా… మిగిలిపోతావ్!” చెప్పింది తల్లి.

ఇంతలో ఏదో ఫోన్ రావడంతో ఎత్తి…

“హలో!” అంది లలిత తల్లి.

“నేనండీ మీ మాజీ వియ్యంకురాలిని” అని ఓ క్షణం ముక్కు చీది…

“మా అబ్బాయి బాత్రూంలో కాలుజారాడు. తలకి చిన్న కౌకు దెబ్బ తగిలి కొంత మర్చిపోయాడు. లలితతో పెళ్ళైన దగ్గర నుండి మాత్రమే గుర్తుంది. ఇప్పుడు మీ అమ్మాయిని కలవరిస్తున్నాడు. కనుక మీ అమ్మాయి వస్తే బావుంటుందని డాక్టర్లు అంటున్నారు. ఇలా అడగడం భావ్యం కాదు, కానీ వాడి జీవితం ఇలా వెనక్కి వెళ్ళిపోతుందని మేం ఊహించలేదు. అక్కడి నుండే మీ అమ్మాయి మా వాడితో కొత్త జీవితం మొదలుపెడితే బావుంటుందని మా ఆశ!” అని ఆమె చెప్తుండగానే…

“అద్భుతం జరిగిందోచ్!” అని లలిత, ఆమె తల్లి జంట కవుల్లా ఒక్కసారే అన్నారు…. చాలా చిన్న స్వరంతో!!

# కలకానిది... విలువైనది...



విశాలి(కొత్తూరి)పేరి,
6362564577

**"ఎంత పెద్ద పెద్ద కోరికలే మడిగా... ఫేస్‌బుక్‌లో అందరూ నా పోస్ట్‌కి లైక్ కొట్టాలి, కామెంట్లు చెయ్యాలి, మా అత్తగారికి వంట వండే పని తప్పాలి... నా పిల్లలకు నేను వండిన వన్నీ వచ్చేయాలి... ఒక పెద్ద విల్లా... ఒక పెద్ద ప్రమోషను... బ్యాంక్‌లో బోలెడు డబ్బు... అంతేగా!" అని అమ్మవారితో అన్నాను**

**"సరే... నీ కోరికలన్నీ తీర్చేస్తా! కానీ..." అని ఆగింది ఆ తల్లి.**

**"కానీలు అర్ధలు వద్దమ్మా... లక్షలే కావాలి!" అని మారాం చేశా.**

**"సరే నీకు ఏ అప్పుల బాధలూ ఉండవు, నీ పేరు మీద బోలెడు డబ్బు వస్తుంది, ఆఫీస్‌లో నీతో పని చేసే వాళ్ళ మాటలు ఉండవు... అత్తగారి సాధింపులు ఉండవు..."**

"అబ్బా... ఇదే ఇదే నాకు కావాలి!"

"మొన్న ఏదో చిన్న పని చేయలేదని బాస్‌గాడు నా కంటే చిన్న వాడైనా ఏమన్నాడో తెలుసా?... అసలు ఆఫీస్‌లో ఏ పని చెయ్యకపోతే ఎలాగా? మీ పని కూడా నేనే చేయాల్సి వస్తోంది, మా ఆవిడ ఇంట్లో కూడా ఆఫీస్ పని చేస్తుంటే డైవర్స్ ఇచ్చేస్తానంటోంది... మా ఆవిడ డైవర్స్ ఇస్తే పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి మీ మీదే కంప్లైంట్ ఇస్తాను!" అని అన్నాడు.

"వాళ్ళావిడ వాడికి డైవర్స్ ఇస్తే నాదేంటి తప్పు? కాబట్టి అమ్మా... ఇలాంటి వాళ్ళందరిని నా ప్రపంచం నుంచి తీసేయ్!" అని అన్నాను.

"అదే అదే... చేద్దామనుకుంటున్నాను. రేపటి నుంచి నీకు బాస్ తిట్లు ఉండవు... అత్తగారి ఆరళ్ళు ఉండవు... పక్క వాళ్ళ చీరల గురించి ఆలోచన ఉండదు..." అని అంది తల్లి.


"అబ్బా... ఎంతటి చక్కటి మాట తల్లి! ఇలాంటి రోజు కోసమే నేను ఎదురు చూస్తున్నాను." అని అన్నాను.

"మొన్న మా పక్కింటావిడ నేను గోడ పక్కన లేనను కొని ఎదు రింటావిడతో ఏమందో తెలుసా?... ఈవిడ అటు ఫేస్‌బుక్‌లోనూ, ఇటు వాట్స్‌ఆప్‌లోను ఇంపోర్ట్ ఎక్స్పోర్ట్ ఉద్యోగంలోనే ఉంటుంది, ఆ గ్రూప్‌లోవి ఈ గ్రూప్ లోకి, ఈ గ్రూప్‌లోవి ఆ గ్రూప్‌లోకి... చస్తున్నాము ఈవిడ పోస్ట్‌లకి, ఇంకా ఎన్నేళ్ళో ఈవిడని భరించాలి. కత్తి పెట్టి పొడి చెయ్యాలన్న కోపం వచ్చేస్తుంది!" అని అంది... ఎంత బాధ కలిగిందో తెలుసా తల్లి?" అని ఆగాను...

"ఇంకో మాట తల్లి... నేను ఎప్పటికీ భగవద్గీతలో కృష్ణుడిలా ఉండాలి అని అనుకున్నా కానీ ఏ ముహూర్తాన పుట్టానో దుర్యోధనుడి నలభయ్యో తమ్ముడిలా అనామకుడిలా, డైలాగులు లేని పాత్రలా ఉండి పోయాను. నేను ఒక్క రోజుంటే ఒక్క రోజైనా తారలా వెలగాలి!" అని వేడుకున్నాను

"నేనూ నిన్ను తారనే చేద్దామని వచ్చాను!" అని అంది అమ్మ.

"నిజంగానా? నేనంటే నీకెంత ప్రేమ తల్లి! నన్ను తారని చేసేయ్ తల్లి చేసేయ్ తల్లి! నన్ను ద్వేషించే వీళ్ళంతా నన్ను తారలా చూడాలి, నా గొప్పతనం తెలుసుకోవాలి, నాకోసం ఏడ్వాలి..." అని చేతులు జోడించి అన్నాను.




"చెప్పానుగా నీ కోరిక తీరుస్తానని!" అని కాస్త మౌనం వహించింది ఆ తల్లి.

"సరే పద నాతో" అని అంది ఒక నాలుగైదు సెకన్లు ఆగి.

'ఎక్కడికి తల్లి?" అని అడిగాను.

"నీ ఆయువు తీరింది... పద నాతో!" అని అంది ఆ తల్లి.

"నా ఆయువువా?" అని షాక్‌లో అన్నాను.

"అవును నీ ఆయువే!" అని అంది తల్లి.

"అదేంటి తల్లి! నా కోరికలన్నీ తీరుస్తానని అన్నావు! ఇలా చంపేస్తావా?" అని గద్గద కంఠంతో అడిగా.

"రేపు నీ ఫేస్‌బుక్‌లో నీ ఫోటో పెట్టి నీ మృతి గురించి నీ పిల్లలో, నీ భర్తో చెప్తారు. అందరూ

నీ గుణగణాలను పొగుడుతారు... బోలెడు లైకులు కూడా వస్తాయి. నువ్వు అందరికీ మంచి దానివి పోతావు. మీ బాస్ బాలాజీ బాధపడతాడు, నిన్ను చంపాలనుకున్న పక్కింటావిడ, ఎదురింటావిడ కూడా నిన్ను పొగుడుతారు, నీకో దండ కూడా తెచ్చి వేస్తారు. ఇన్సురెన్స్ కంపెనీ నుంచి బోలెడు డబ్బులు కూడా నీ పేరుతో వస్తాయి నీ పిల్లలకి. ఇదే కదా కావాలి నీకు?" అని అడిగింది.

"అదేంటమ్మా! నా వయసిప్పుడు ఎంతని? మొన్ననే కదా నలభై దాటింది, ఇంకా పిల్లల ముచ్చట్లు చూడలేదు, నాకు ఏమైనా అయితే మా ముసలి అత్తగారు ఏమైపోతుంది? ఆఫీస్ లో ఇంకా చాలా పనులు ఉన్నాయి... అన్నీ పాపం ఆ బాలాజీ ఒక్కడే చూసుకోలేడు కదా? పక్కింటి ఆవిడకి, ఎదురింటి ఆవిడకి నా మీద ద్వేషం పోగొట్టాలి కదా! అయినా నువ్వేదో పొరపడ్డావు తల్లి, మా వీధిలో నా పేరుతో ఇంకో నలుగురు ఉన్నారు. వాళ్ళల్లో ఎవరో ఇంటికి వెళ్ళాల్సింది నా ఇంటికి వచ్చేశావు. అయినా ఇలా తీసుకెళ్ళడానికి యమదూతలు వస్తారే... నువ్వెందుకు శ్రమ పడ్డావు తల్లి... అలవాటు లేని పని కదా... తప్పు అడ్రస్‌కి వచ్చావు!" అని అన్నాను.

"నీ ఆఫీస్ పని నీ స్టాఫ్ చేస్తుంది కదా... అలాగే మాలో మేము మా టాస్క్‌లు ఇలా పంచుకుంటాము... ఇట్స్‌యే టీం వర్క్. మీకు ఆధార్ కార్డు, పాన్ కార్డులు ఉన్నట్లే మాకు కొన్ని గుర్తులు ఉంటాయి.. నేనేమి పొరబడలేదు కానీ పద పద! నీకే మూడింది!" అని అంది.

"ఒక్క ఛాన్స్ ఇవ్వు తల్లి.. నాకు ఇంకా బతకాలని ఉంది!" అని దీనంగా అన్నాను.

"టైం ఎక్కువ లేదు.. ఇంకో రెండు నిమిషాలే... పద పద" అని తొందర పెట్టింది.

గట్టిగా అలారం మోగింది...

ఇంతలో మెలుకువ వచ్చేసింది. ఇది కలా? అమ్మో ఇంత భయంకరమైన కలే!

✦✦✦

నెల గడిచింది...


"నువ్వు లేకపోతే నాకు తిండి పెట్టే నాథుడెవ్వడు? నా పాలిట అన్నపూర్ణాదేవివి కాదు కాదు కన్న తల్లివి నువ్వు" అని అత్తగారు చెయ్యి పట్టుకొని కళ్ళ నీళ్ళతో అన్నారు.

"ఏంటీ ఈ మధ్య రాకెట్టులా దూసుకొని పోతున్నారు. నెళ్ళాల్లల్లో చెయ్యాల్సిన వర్క్ పది రోజులకే ప్రొడక్షన్‌కి పంపేశారు. మీరు గ్రేట్!" అని అన్నాడు బాలాజీ.

"ఒకప్పుడు మీ ఫేస్ బుక్‌లో అన్నీ ఎత్తిపోతల పథకాలల్లాగా ఉండేవి పోస్టులు... ఇప్పుడు సామాజిక అంశాలతో చాలా ఆలోచింప చేసేవిగా ఉంటున్నాయి" అని కామెంటు చేశారు పక్కింటావిడ, ఎదురింటావిడ.

అందమైన జీవితం నాది... ఉన్నదాన్ని సద్వినియోగ పరచుకోవాలి కూడా ఒక కళ. చేతిలో ఉన్నప్పుడు దాని విలువ తెలీదు. అయిపోయింది, కరిగిపోయింది అని అన్నప్పుడే అది అపురూపం అవుతుంది... సంపూర్ణ జీవితాన్ని అర్థవంతంగా జీవించాలి... ఇది నా నిర్ణయం!

విగ్రహంలో నుంచి చిరునవ్వుతో నన్ను చూస్తోంది కామదాయిని కామాక్షి.



# వ్యసనం కథ



పద్మ పైడిమర్రి,
7675045608

**"కాంతం... కాంతం..." అంటూ సుబ్బారావు గుమ్మంలో నుంచుని కంగారుగా భార్యని పిలిచాడు.**

**వంటగదిలో పని చేసుకుంటున్న కాంతం, భర్త అరుపులు వినిపించినా, ఇది మామూలే అన్నట్టుగా ఇవతలకి రాలేదు.**

**కానీ రాత్రే వూరు నుంచి వచ్చిన కాంతం తమ్ముడు గిరి- "అక్కా! బావగారు పిలుస్తున్నారు. కాదు కాదు అరుస్తున్నారు. ఏమైందో?" అన్నాడు కంగారుగా.**

**"నేను కొంచం పనిలో వున్నా, ఆయన అక్కడ ఏమి చేస్తున్నారో? ఎందుకు అరిచారో? చూడరా!" అంది కాంతం.**

"అక్కా! ఒకసారి ఇటురా, బావగారు వీధి గుమ్మంలో నిలబడి పక్క ఇంటి కేసి ఒక రకంగా చూస్తున్నారే...." అన్నాడు గిరి.

"రోజూ నాకు ఇది అలవాటే... ఎంత చెప్పినా వినరు. ఆయన ఇప్పుడిప్పుడే లోపలకు రారు. నువ్వు రారా... కాఫీ తాగుదువుగాని!" అంది కాంతం.

"అదేంటి అక్కా!... బావగారు అదేపనిగా ఇందాకటి నుంచీ పక్క ఇంటికేసి కొంచం ఆశగా చూస్తున్నారు. నువ్వు అసలు ఏమీ పట్టించు కోవేమిటి?" అన్నాడు గిరి.

ఇంతలో బయట నుంచీ...

"కాంతం... కొంచం సాయం చెయ్యవా?" అన్నట్టు దిగులుగా పిలిచాడు సుబ్బారావు.

"అబ్బా! నేను ఏమీ చెయ్యలేను. మీ కోరిక తీర్చడం నావల్ల కూడా కాదు. వాళ్ళ గుమ్మంలో చూడండి... వాళ్ళ పెంపుడు కుక్క టామి ఎలా చూస్తోందో... దొరికామా కేజీ తక్కువ పీకదు. లోపలకు వచ్చి కొంచం కాఫీ తాగండి. తరువాత చూద్దాం!" అంది కాంతం విసుగ్గా.


"నే రాను... నాలుగు రోజులనుంచీ ఇలాగే అవుతోంది. ఈ రోజు ఎలాగైనా దక్కించుకుంటా. నువ్వు సాయం చేస్తే చెయ్యి... లేకపోతే లేదు!" అని అక్కడే నుంచున్నాడు సుబ్బారావు.

"నాకు ఏమీ అర్ధం కావడంలేదు అక్కా! బావగారు గంటనుంచీ పక్కింటి కేసి ఎందుకు అంతలా చూస్తున్నారూ? పైగా నిన్నే సాయం అడుగుతున్నారు. నీకు ఎలా వుందో గాని, నాకు అయితే సిగ్గేస్తోంది బావగారిని చూస్తుంటే." అన్నాడు గిరి చిరాగ్గా.

"ఒరేయ్ తమ్ముడూ! నువ్వు మరీ ఎక్కువ బాధ పడకురా!... ఏమి చేస్తాం? మీ బావగారు ఆ వ్యసనానికి బాగా బానిస అయిపోయారు. మార్చడానికి చాలా ప్రయత్నం చేసా. కానీ నా వల్ల కాలేదు." అంది కాంతం.

ఇంతలో సుబ్బారావు ఒకరకమైన ఉద్విగ్నంతో-

"హమ్మయ్య!! నా కోరిక తీరింది కాంతం. నాలుగు రోజులు అయిపోయింది దీన్ని చూసి!" అంటూ... అపురూపంగా దాని కేసి చూస్తూ... ఇప్పుడు తీసుకురా కాఫీ, రుచి అదిరిపోవాలి." అని తన గదిలోకి వెళ్లిపోయాడు సుబ్బారావు ఆ రోజు న్యూస్ పేపర్ పట్టుకుని.



"అక్కా!..." పొద్దున్నుంచీ ఈ హంగామా అంతా పేపర్ కోసమా?" అన్నాడు గిరి ఆశ్చర్యంగా.

"ప్రతిరోజూ వొచ్చేదే అయినా... రోజూ ప్రపంచకప్ తెచ్చినట్టే తెస్తారు మీ బావ గారు ఆ పేపర్ని. మాకు పేపర్ వేసేవాడు నాలుగు రోజులనుండీ రావడంలేదు. అందుకే మీ బావ గారు... పక్క ఇంటి గుమ్మంలో వున్న వాళ్ల పేపరు కోసం అలా ఆశగా చూస్తున్నారు." అంది కాంతం నవ్వుతో.

ఇవన్నీ వింటున్న సుబ్బారావు–

"మీకేమి తెలుసు పేపర్ చదవడంలో వున్న మజా! ఒక చేత్తో పేపర్ పట్టుకుని, మరో చేత్తో కాఫీ గ్లాస్ పట్టుకుని... ఒకొక్క పేజీ గాలికి ఎగిరిపోకుండా, కాఫీ ఒలికిపోకుండా, కష్టపడి మడత పెట్టుకుంటూ చదవడం, మీరు అనుకున్నంత అంత సులభం కాదు!" అన్నాడు గర్వంగా.

"అవునురా తమ్ముడూ!... మనకి అరవై నాలుగు కళలే అన్నారు గాని అరవై ఐదో కళ కింద ఈ పేపర్ చదవడం పెట్టీ, అందులో పరీక్ష పెడితే... మీ బావగారికే డాక్టరేటు వస్తుంది." అన్న అక్క మాటలకు...


"అయితే కర్ణుడు కవచకుండలాలతో పుట్టి నట్టు బావగారు పేపర్ తో పుట్టారాన్న మాట." అన్నాడు గిరి నవ్వుతూ.


ఎవరేమనుకుంటే నాకేంటి? అన్నట్టుగా పేపర్లో మునిగిపోయాడు సుబ్బారావు.



# చిలిపి చిలుకలు

మురళీధర్






# పుట్టువెంట్రుకలు - పులిగోరు



వేలూరి ప్రమీలాశర్మ,
9492535415

**"రైలు దిగి అరగంట పైనే అయింది. ఒక్క ఆటో కూడా బేరం కుదిరిచావట్లేదు. నుంచుని నుంచునీ కాళ్లు పీకేస్తున్నాయి. ఇక నావల్ల కాదు." నీరసంతో కింద కూలబడిపోతూ చెప్పింది బల్లిపాప.**

**"అదిగో... ఏదో ఆటో ఇటే వస్తోంది. ఈసారి ఎలాగైనా ఎక్కేద్దాం. కాస్త ఓపిక పట్టు." చెప్పాడు చీపురుపుల్ల చిన్నారావు.**

**"ఆ వచ్చే ఆటోకి ముందు నేను చెయ్యి ఊపాను. మీకన్నా గంట ముందునించీ ఇక్కడ నుంచున్నాను. వెధవ పీనుగులు... ఒక్కడూ బేరం కుదరనివ్వట్లేదు. ఈసారి ఈ ఆటో వదలకుండా ఎక్కాల్సిందే" ఎనభై ఏళ్ళు పైనే ఉన్నా రివటలా, నిటారుగా నుంచుని, ఊతకర్ర సాయంలేకుండా చకచకా నడిచేస్తున్న బంగారుతల్లి కంగారు కంగారుగా చెప్పేసింది.**

"అదేం కుదరదు! ఆ ఆటోని మేమే ముందు పిలిచాం... మేమే ఎక్కుతాం." ఒళ్ళు మోసుకోలేక ఒగురుస్తూ చెప్పింది బల్లిపాప.

"ష్! అనవసరంగా గొడవ చేయకు. మనతోపాటే ఆవిడ్నీ ఎక్కనిస్తే, డబ్బులు కలిసొస్తాయి!" తెలివితేటలు ఉపయోగించాడు చీచి.

వాళ్ల మొర దేవుడు ఆలకించినట్టున్నాడు...ఇద్దరికీ చెరో వందా ఇస్తే అన్నవరం కొండకి ఆటో కడతానన్నాడు ఆటో అప్పారావు. పాపం బంగారుతల్లి బేబీ సీటు మీద సర్దుకోవలసివచ్చింది.

"మరీ జట్కాబండిలా తోలుతున్నావ్... కాస్త స్పీడుగా పోనీవయ్యా!" హుకుం జారీ చేసాడు చీచి.

"మేడంగారు కూచున్న వైపు టైరులో గాలి తగ్గిపోయిందండీ... బండి లాగట్లేదు, నన్నేం చెయ్యమంటారు?" విసుకున్నాడు అప్పారావు.

"ఊ ఊ సరేలే... ఆక్సిల్ రేటర్ మీద చెయ్యి వదిలేసి, అలా వెనక్కి చూపించకు బండి వెనక్కి జారిపోతుంది. సరేకానీ, కడుపులో కాస్తంత ఫ్యూయల్ వేసుకోవాలి. అక్కడేదో చెరుకురసం బండి కనిపిస్తోంది ఓసారి ఆపు!... నిన్నేనయ్యా! దాటి ముందుకి వెళ్లిపోతున్నాం... ఆప మన్నానా?" చిన్నారావు కేకకి గట్టిగా బ్రేక్ మీద కాలేసి తొక్కాడు అప్పారావు.

ఒక్క జర్కుతో ఆటో ఆగడంతో బల్లిపాప చంకలో ఉన్న చంటాడు కాస్తా సీటు కిందకి జారిపడ్డాడు.

ఆరున్నొకరాగం ఎత్తుకున్న వాడి నోరు మూయించలేక సతమతమవుతున్న బల్లిపాప...ఉక్కపోతకి చంటాడి మెడలో ఉన్న పులిగోరు గుచ్చుకుంటుందని, గొలుసు తీసి చిన్నారావు కోటు జేబులో వేసింది.

చెరుకురసం తాగడం పూర్తయ్యాక గ్లాసు మొత్తం నాలుకతో నాకేస్తున్న చిన్నారావు అదేమీ గమనించలేదు.

ఒక్కొక్కరికీ పది గ్లాసుల చెరుకురసం కడుపులో పడ్డాక శాంతించారు ఆ దంపతులిద్దరూ. వాళ్ల మాటల్ని బట్టి చంటాడికి పుట్టువెంట్రుకలు తీయించడానికి అన్నవరం వచ్చారని తెలుసుకున్నాడు అప్పారావు. పది నిమిషాల్లో అన్నవరం కొండకి చేరాల్సిందల్లా...కాడెద్దులా కష్టమర్లని లాగుతున్న ఆటో, ఎలాగైతేనేం అరగంట తర్వాత కొండమీదకి చేరింది.

"ఆగాగు! ఆ ప్రసాదాల కౌంటర్లో ఆరు ప్యాకెట్లు పట్టుకురా! అవి తింటేగాని కొండపైకి నడిచే ఓపిక లేదు" జేబులోంచి వంద కాగితం తీసి అప్పారావుకిస్తూ చెప్పాడు చీచి.

"ఇప్పుడేగా ఇద్దరు బిందెడు చెరుకురసం తాగారు." గొణుక్కుంటూ, వంద కాగితం అందుకుని...

"తప్పదురా భగవంతుడా!" అనుకుంటూ ప్రసాదాలు తేవడానికి కౌంటర్ వైపు వెళ్ళాడు అప్పారావు.

"మీరు తీసుకోరా? అదే... ప్రసాదం మీకు అక్కర్లేదా అంటున్నా. ఇందాక చెరుకురసం కూడా రెండు గ్లాసులే కొనుక్కున్నారు. పైగా ఓ గ్లాసు తాగి... రెండోది మరచెంబులో పోయించుకున్నారు... పాపం పొట్ట పట్టదు గావున్ను. పోనీ కాసేపాగి దర్శనం చేసుకున్నాక అన్న ప్రసాదం తిందురుగానిలే!"



ప్రశ్నా, సమాధానం తనే చెప్పేస్తూ అడిగింది బల్లిపాప.

బంగారుతల్లికి మాట్లాడ్డానికి మేటర్ ఏమీ లేక... సరే అన్నట్టు తలాడించి, మరచెంబులోకి చెరుకురసం పోయించుకున్న విషయం గుర్తుచేసినందుకు కృతజ్ఞతగా... ఓ చిరునవ్వు నవ్వింది.

ఆటో కదిలితే తాగడం కష్టం అనిపించి, ఆటోలోనే కూచుని మర చెంబు ఎత్తుకుని గటగటా చెరుకురసం చుక్కకూడా మిగల్చకుండా తాగేసి... చెంగుతో మూతి తుడుచుకుని, కప్ప అరిచినట్టుగా ఓ తేన్పు తేన్చింది.

“ఇదిగో అబ్బాయ్! ఓ రెండుగంటల్లో దర్శనం పూర్తిచేసుకుని మళ్ళీ కిందకొచ్చేస్తాం...కాస్త ఊరు చూబిద్దుగాని... ఇక్కడే ఉంటావుగా” ప్రసాదాలు అందుకుంటూ చెప్పాడు చీచి.

“ఉండక ఎక్కడికెళ్తాను సామీ...ఆటో టైర్లు రెండూ మీ బరువుకి గాలొదిలేసాయి. రిపేరు చేయించేసరికి ఆ టైమే అవుద్దిలే!” విసుక్కుంటూ చెప్పాడు అప్పారావు.

“ఇందా... అందాకా ఈ వందా ఉంచు... రిపేరుకి పనికొస్తుంది!” కవచకుండలాలు లేని కర్ణుడిలా ఫోజుపెట్టి ఆటోవాలా చేతిలో నోటుంచుతూ చెప్పాడు చీచి.

ఆటో దిగి, గబగబా నడుచుకుంటూ... క్యూలైన్లోకి దూరేసిన బంగారుతల్లి, వెనకాల ఈడ్చుకుంటూ వస్తున్న వాళ్ళిద్దర్నీ చూసి, విశాలమైన బోసి నోటితో వెటకారంగా నవ్వింది.


ఒళ్ళుమండిన బల్లిపాప వందరూపాయల టికెట్టు కొని, ఓ మెట్టు పైకెక్కి నుంచుని గర్వంగా చూసింది.

మొత్తానికి సీనియర్ సిటిజన్ కోటాలో విఐపిలా వాళ్ళతోపాటే గర్భగుడి సమీపంలోకి ప్రవేశించిన బంగారుతల్లి, అక్కడున్న బొంత కాకుల్లాంటి ఆ జంటను చూసి, మళ్ళీ బోసినోటితో నవ్వింది.

అసలే ఉక్కపోతకి మంటెక్కిపోయి ఉన్న బల్లిపాప, ఊపిరాడక చీర చెంగుతో విసురుకుంటూ, చికాగ్గా మోచేతితో తన చంకలో ఉన్న హ్యాండ్ బ్యాగ్ ను వెనక్కి తోసింది.

“ఛీ...ఛీ!... ఇలా జంతు చర్మాలతో చేసిన హ్యాండు బ్యాగులు గర్భగుడి వరకూ తేవడమే తప్పు. పైగా నాలాటిదానికి తగిలిస్తావా?... వెనకా ముందూ చూస్కోనక్కర్లా? అపచారం...అపచారం!” అంటూ గబగబా చెంపలేసేసుకుంది బంగారుతల్లి.

ఇంకా అక్కడే ఉంటే...చిన్న సైజు జలపాతంలా కారుతున్న చంటాడి ముక్కు తుడిచి, ఆ చెంగు తన నెత్తిన ఎక్కడ వేస్తుందోనని భయపడి... చీచి వైపుకి జరిగి నుంచుని, కళ్ళు మూసుకుని భగవన్నామస్మరణ మొదలుపెట్టింది. జనసమ్మర్ధంలో గాలాడక, జేబులోంచి రుమాలు తీసి, మొహానికీ, మెడకీ పట్టిన



చెమటను తుడుచుకున్న చీచీ... బల ప్రయో గంతో భక్తుల్ని ముందుకి తోసేసి, గుంపుతో పాటు ముందుకి కదిలాడు.

ఒక్కసారిగా చేతిమీద ఏదో పడినట్టై... విసురుగా తీసి విసిరేసింది బంగారుతల్లి.

భక్తుల రద్దీ, తోపులాటలో బంగారుతల్లి, వాళ్ల నుంచి వేరుపడిపోయింది.

ఓ పూజారి ఆమె అవస్థను గమనించి, కొంచెం రద్దీ తగ్గే వరకూ ఇలా పక్కకి వచ్చి నుంచోమని పిలవడంతో, స్థంభం చాటు చేసుకుని నిలబడింది బంగారుతల్లి.

దర్శనమయ్యి బయటకు రాగానే, పిల్లాడి మెడలోవేసిన పులిగోరు గొలుసు కనపడక గొల్లుమంది బల్లిపాప.

అంతలోకే తనభర్త జేబులో వేసిన విషయం గుర్తొచ్చి ఊపిరిపీల్చుకుంది.

కానీ ఎంత వెదికినా జేబులో ఆ గొలుసు కనపడక పోయేసరికి కంగారుపడిపోయింది.

చిల్లరకోసం జేబులో చెయ్యి పెట్టినప్పుడు చెరుకురసం బండి దగ్గర పడిపోయిందేమోనని కొంత సేపూ... ఆటోలో పడిపోతే అప్పారావు తీసే సాడేమోనని కొంతసేపూ... బల్లిపాప మనసు పరిపరివిధాల పోయింది.

మళ్లీ ఏదో గుర్తొచ్చినదానిలా గర్భగుడి వైపు పరిగెత్తి, అక్కడే ఉన్న బంగారుతల్లికి పులిగోరు గొలుసు విషయం ఏమైనా తెలుసేమోనని ఆరా తీసింది.

తల అడ్డంగా, నిలువుగా అయోమయంగా ఆడిస్తున్న బంగారుతల్లితో...

"అదేమిటమ్మా! ఇందాక జనం మధ్యలోంచి మీరేగా హుండీలో పడేలా విసిరేశారు!!" ఆమె మొహంలో రంగులు మారడం గమనించి, ఆర్థోక్తిలో ఆగిపోయాడు పూజారి.

"జంతు చర్మంతో చేసిన లెదరు బ్యాగు తగలనన్నప్పుడే మిమ్మల్ని అనుమానించా ల్సింది... ఆయన జేబులోంచి రుమాలు తీసిన ప్పుడు విసురుగా గొలుసొచ్చి మీ మీద పడుం డొచ్చు. పులిగోరు తగలగానే పూనకం వచ్చి నట్టు దూరంగా విసిరి పారేశారన్నమాట. హు! పదండి చెప్తా..." అంటూ చెయ్యిపట్టుకుని బరబరా లాక్కుపోతున్న బల్లిపాప, తనని ఏ పోలీసులకో అప్పచెబుతుందనుకుని కంగారు పడిపోయింది బంగారుతల్లి.

విదిలించుకుంటున్నా వినకుండా చెయ్యి పట్టుకుని లాక్కుపోయి, తలనీలాలర్పించే క్షురకుడి ముందు కూచోపెట్టి... తీయించుకో మన్నట్టు కళ్ళతో సైగ చేసింది బల్లిపాప.

"ఇదేమిటీ? మన చంటాడికి కదా పుట్టు వెంట్రుకలు తీయించాలి!? ఈవిడ్ని కూచో బెట్టావేమిటీ!?" ఒగుర్చుకుంటూ అక్కడికి చేరిన చీచి వైపు కాపాడమన్నట్టు దీనంగా చూసింది బంగారుతల్లి.

"చంటాడి పులిగోరు దొరికితే...ఈ బామ్మ గారి తలనీలాలు ఇస్తానని... నేను మొక్కు కున్నాను మరి. ముందీవిడకి కానివ్వండి... తర్వాత చంటాడి సంగతి చూద్దాం!" అసలు విషయం చెప్పింది బల్లిపాప.


"అంటే ఇవి పులిగోరు నీలాలన్నమాట! పాపం... బామ్మగారు!" అనుకుంటూ జాలిగా చూసాడు చీచి.


తనతల్లి నూరేళ్లు పూర్తిచేసుకుంటే తల నీలాలిస్తానని మొక్కుకున్న సంగతి గుర్తొచ్చి... ఈ ఏడాదికి వందా నిండిపోయాయని లెక్క లేసుకుని... పుణ్యం, పురుషార్థం కలిసొస్తా యని... సంతోషంగా తలనీలాలివ్వడానికి ఒప్పుకుంది బంగారుతల్లి.



## ఈ నెల 'దినం'

అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం -సెప్టెంబర్,15



# ముళ్ళపూడివారి కథలకు కేరాఫ్ అడ్రస్-
# అక్షజ్ఞ పబ్లికేషన్స్

**డాక్టర్ ముదునూరు వెంకటేశ్వరరావు ఎమ్మెస్సీ (మ్యాథమెటిక్స్), ఎమ్మెస్ (స్టాటస్టిక్స్), పీహెచ్డీ (స్టాటస్టిక్స్) మాత్రమే అంటే హాస్యానందం పత్రికలో ఇంటర్వ్యూ ఎందుకు చేస్తాం!... విదేశాల్లో 14 సంవత్సరాల పాటు యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఫ్లోరిడాలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ స్టాటస్టిక్స్ ఉద్యోగం చేశారు ... అంటే మాత్రం మన పత్రికలో ఇంటర్వ్యూ చేయాల్సిన పని ఏముంది ?**

*విదేశాల్లో ఉన్న 14 సంవత్సరాలలో ఆన్లైన్ తెలుగు పుస్తకాలు విపరీతంగా చదివేసి... తెలుగు భాష పట్ల మమకారం ద్విగుణీకృతమై తెలుగు అక్షరాల్లో తడుస్తూ తలమునకలై పోతుండగా... అసలు మనమే ఒక పుస్తక ప్రచురణ సంస్థ పెడితే ఎలా ఉంటుంది అని... అనుకుని... పక్కా అనేసుకుని... ఖాయంగా నిశ్చయించుకుని... కూతురు విష్ణు శ్రీకృతి పుట్టిన రోజు కోసం ఇండియా వచ్చిన ఉత్తరక్షణంలో... బ్నిం గారి దర్శకత్వంలో డాక్టర్‌వెంకట్, డాక్టర్ విద్యా భార్గవి నాయికా నాయకులుగా ... పుస్తక ప్రచురణ రంగంలో ప్రవేశించారు.*

*ఎంతో చక్కటి అభిరుచితో శంకర్‌గారి చిత్రాలతో కార్టూన్లతో 'కార్టూనిస్టుల రూపురేఖలు పుస్తకాన్ని ప్రచురించిన మన అభిమాన రచయిత ముళ్ళపూడి వెంకటరమణ గారి రచనలు పునర్ముద్రణ చేస్తూ ఆనందిస్తున్న అక్షజ్ఞ పబ్లికేషన్స్ స్థాపకులు, హాస్యానందం వీరాభిమాని డాక్టర్ ముదునూరు వెంకటేశ్వరరావు గారి మనసులో మాట...*

**రాము:** ఒక నాలుగేళ్ల నుంచి బాగా ఎక్కువగా అక్షజ్ఞ పబ్లికేషన్స్ పేరు తెలుగు పుస్తక అభిమానుల నోట బాగా వినిపిస్తోంది... అంతకుముందు పాఠకులకి తెలుసనుకోండి .. ఈ మధ్య బాగా ప్రచారంలోకి వచ్చేసింది. మీ తొలి పుస్తకం...?

**వెంకట్:** మొదటిసారి వేసిన పుస్తకం కన్నా అసలు అక్షజ్ఞ అంటే చెప్పొద్దా?

**రాము:** అవునండోయ్.. నేను చాలా రోజుల నుంచి ఆలోచిస్తున్నాను.

**వెంకట్:** 'అక్షజ్ఞ' అంటే అక్షజ్ఞుడు... అంటే కుమారస్వామి.

**రాము:** అబ్బో... వాగర్థాలాంటి పార్వతీ పరమేశ్వరుల బిడ్డ... అక్షజ్ఞుడు...బావుంది సార్! వాక్కు అర్థమూ అంటే పుస్తకమే కదా!

**వెంకట్:** ఈ మధ్యన బ్నిం గారి అన్నయ్య శర్మ గారు ... అక్షజ్ఞ అంటే అ నుంచి క్ష వరకు జ్ఞ అంటే తెలిసినవాళ్లు అని విశ్లేషించారు మా సంస్థ మీద.

**రాము:** చాలా బాగుంది! తెలియజేసేది పుస్తకమే!... తెలిపేవాడు తెలిసినవాడే కదా!

**వెంకట్:** కదామరి!... సరే మేము ప్రచురించిన తొలి పుస్తకం 'చేత వెన్న ముద్ద'. ద గ్రేట్ డాక్టర్ తనికెళ్ల భరణి గారితో రాయించు కున్నాం. అలా శ్రీకారం చుట్టుకుని మా పెద్ద పాప విష్ణు శ్రీకృతి పుట్టినరోజు నాడు వచ్చిన బంధుమిత్రుల మధ్య ఆవిష్కరించాం.

**రాము:** తొలి పుస్తకమే గ్రేట్ తనికెళ్ల భరణితో ప్రారంభించారు ఎక్సలెంట్!

**వెంకట్:** అంతేకాదు...మాకో సెంటిమెంటూ కమిట్మెంటూ... ఆయనతో అగ్రిమెంటూ కూడాను... మేము ఏ సభ చేసిన మాతోపాటు



ఆయన ఉండి తీరాల్సిందే.

**రాము:** డిటో డిటో మాకు అంతే. మా తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం బహుమతి ప్రదానోత్సవానికి ఆయన రాకపోతే సభకి సందడే ఉండదు !!

**వెంకట్:** అంతే కదా! మనకి ఈ రెండు 'బీ' ల బంధుత్వం అలా పెనవేసుకుని బిగిసిపోయింది మరి.

**రాము:** అన్నట్టు రెండు కాదండోయ్ మూడు... భరణి, బ్నిం, బాపు రమణ అకాడమీ కూడా ఉంది మనతో!

**వెంకట్:** కరెక్ట్! కరెక్ట్!

**రాము:** ఇప్పుడు ఇంకో క్వశ్చన్.. అక్షజ్ఞ పబ్లికేషన్స్ పెట్టుండక పోయుంటే మీరు ఏం చేసేవారు??

**వెంకట్:** అమెరికాలో సెటిల్ అయిపోయి ఉండేవాడినేమో.

**రాము:** మీకు పబ్లికేషన్ రంగం బావుందా?

**వెంకట్ :** బావుందా అంటే?

**రాము:** లాభసాటిగా ఉందా అని!

**వెంకట్ :** మాకు ఇష్టమైన పని చేస్తున్నాం... చాలా ఆనందిస్తున్నాం. మరి మీరు హాస్యానందం నడిపేస్తుంటే పొందే లాభం...

**రాము:** బోల్డు ఆనందం!

**వెంకట్:** అచ్చం అలాంటి ఆనందమే మాదీను! ఇప్పటికి దాదాపు 50 పుస్తకాలు వేసాము. అందులో కొన్ని కేవలం ఆ రచన మీద ఇష్టం వల్ల! దాన్ని మన బ్యానర్‌లో చూసుకోవాలని సరదా వల్ల! పుస్తకం ఆవిష్కరణ జరిగిన రోజు కలిగే ఆనందంతో పుస్తకం పెట్టుబడి వచ్చేసినట్లే ఉంటుంది!

అక్షజ్ఞ పబ్లికేషన్స్ ముళ్ళపూడి వెంకట రమణగారి రచనలు ముద్రించడంతో ఒక గర్వాన్ని సమకూర్చుకుంది. ముళ్లపూడి శ్రీదేవిగారు మా కోసం ప్రత్యేకంగా 'రమణీయ శ్రీ భాగవతం' రాసి ఇవ్వడంతో ఆ ఆనందం ఇనుమడించింది.

అలాగే అయిదారేళ్ల నుంచి బ్నింగారి పుస్తకాలు వేసుకుని ఆనందిస్తున్నాం. తనికెళ్ల భరణి గారివి నాలుగు పుస్తకాలు వేసాం.

ఇంకా మేము ఫలానా పుస్తకం వల్ల నష్టపోయామని గాని... ఫలానా పుస్తకం వల్ల టాప్ పబ్లిషర్స్ అయిపోయామని గాని అనట్లేదు. అనుకోనూ లేదు. మాకిష్టమైన పుస్తకాలు వేసాం ... వేస్తున్నాం... వేస్తూనే ఉంటాం...!

ఇంకా చాలా మంచి పుస్తకాలు వేసి చవగ్గా ఇవ్వాలి అనే ఆశ ఉంది. కానీ పుస్తకం ఖరీదులో దాదాపు సగం విక్రయించే స్టాల్స్‌కి కమిషన్ ఇవ్వాల్సి వస్తోంది. కొంతమంది అది కూడా ఎగ్గొట్టిన గొప్ప సంస్థలు ఉన్నాయి కూడా. వాళ్లకి ఎన్ని బ్రాంచ్‌లు ఉన్నా... అలాంటి వాళ్లకు మేం మా బుక్స్ కచ్చితంగా ఇవ్వద్దు అని ముందే డిసైడ్ చేసుకున్నాం. మా పుస్తకాలు కుటుంబ రచయితల పుస్తకాలు! మా అక్షజ్ఞ పబ్లికేషన్స్ ఓ కుటీర పరిశ్రమ! మా లాభం సాటిస్ఫాక్షన్!

**రాము:** తీరిక వేళల్లో ఏం చేస్తుంటారు?... అసలు మీకు తీరిక దొరుకుతుందా?

**వెంకట్:** భేషుగ్గా దొరుకుతుందండి. దొరికినప్పుడు ఇలా ఇంటర్వ్యూలు ఇస్తుంటాను!

**హా:** అయితే మనలో మన మాటగా ఒక ప్రశ్న అడగమంటారా?...ఆహ అది... మీరు ఇలా లాభాలు లేని సరదాలు పడుతుంటే... మీ ఇంట్లో మీ శ్రీమతి గారు అంగీకరిస్తున్నారా?

**వెంకట్:** అయ్యో రామ! ఆవిడ అక్షజ్ఞ సీఈవో అండి! మా విద్య భార్గవి కూడా వన్ ఆఫ్ ది స్థాపకురాలే! నా ఆత్మానందపు బెనిఫిట్స్ అన్ని ఆవిడ కూడా ఎంజాయ్ చేస్తుంది.

**రాము:** ఇంకొక్క సీక్రెట్ చెప్పేయండి ... అది మీ గ్లామర్ రహస్యం .. మీరు విదేశాల్లో పదేళ్లు ఉన్నారు ఇండియాకు వచ్చి నాలుగేళ్ల యింది. అంతకుముందు ఇక్కడ పిజి చేశారు.. ఇవన్నీ చూస్తే మీ వయస్సు బాగానే ఉండాలి...కానీ అలా ఉండరు..

**వెంకట్:** బాగుండదనేనా మీ అభిప్రాయం?? నా అందం నాదండి?... మా అద్దానికి నచ్చింది! నా అర్థాంగికి నచ్చింది! బాగానే ఉండాలి కానీ అలా ఉండరు అంటే మీ ఉద్దేశం??

**రాము:** అది కాదు... మీకు ఏజ్ కనిపించదు ఏంటి రహస్యం అని!

**వెంకట్:** ఓహ్ అదా మీ దౌటానుమానం... నిజమేనండి నన్ను చూసి చాలామంది ఏదో చిన్న పిల్లాడుగా అనుకుంటారు .. నేను అలాగే అనుకోవడం మొదలు పెట్టాను.

(ఇద్దరు నవ్వుకున్నాం!)

**రాము:** ఇంక త్వరలో మీరు వేసి ఆనందం పొందే పుస్తకాలు ..

**వెంకట్:** 'నామ రామాయణం' సెకండ్ ఎడిషన్ వస్తోందండి. బొమ్మలతో పిల్లల కోసం చాలా బాగా వచ్చింది పుస్తకం.. ఇప్పుడు దాన్ని తెలుగులోనే కాకుండా ఇంగ్లీషే చదవడం వచ్చిన మన తెలుగువాళ్ల కోసం ఇంగ్లిష్‌లో కూడా వ్యాఖ్యానం రాశాను.

అదికాక ఈ సంవత్సరం అక్టోబర్ 28న బ్నింగారి పుట్టినరోజు నాడు ఆవిష్కరించే ప్రతిష్ఠాత్మకమైన పుస్తకం 'బాపు గారితో నేను' ఏఫోర్ సైజ్.. మల్టీకలర్.. పుస్తకం తయారవుతుంది!

**రాము:** బాపుగారితో నేను పుస్తకం చూడాలని నాక్కూడా చాలా సరదాగా ఉంది. నాలుగేళ్ల క్రితం నుంచి ఆయన రాస్తానని బెదిరిస్తున్నారు కదా?!

**వెంకట్:** అవును అలాగే ఊరిస్తున్నారు! ఈసారి కంప్లీట్ చేయాల్సిందే అని చెప్పాను. సీరియస్‌గానే ఆ పని మీద కూర్చున్నట్టేవుంది.

**రాము:** అవునండి... మొన్న కలిసినప్పుడు కూడా అదే వెలుగులో కని పించారు. బాపు గారి మెమరీస్ లో కళకళలాడుతున్నారు.


**వెంకట్ :** అది సరే ..మిమ్మల్ని నేను క్వశ్చన్ అడగొచ్చా?

**రాము:** గొచ్చు....

**వెంకట్:** ఇప్పుడు నన్ను ఇంటర్వ్యూ చేశారు. దీన్ని హాస్యానందం పత్రికలో వేస్తే మనకి రెండు పేజీలు దండగా కదా అని ఆలోచన రాలేదా ?

**రాము:** వచ్చేదేమో కానీ... మనకి ఇష్టమైన పనులే మనం చేస్తాం కదండీ! అందుకని ఆ ఆలోచన రాబోయి పారిపోయింది.

(వెంకట్ గారు నవ్వేరు.. నవ్వారు ఆనందంగా నవ్వేరు.)


టీవీ ఫన్
టీవీలో ఎప్పుడూ మీ ఉపన్యాసం అంటే నాకెంతో ఇష్టం!
VOTE
ఎందుకంటే... ఏ క్షణమైనా టీవీనే ఆపేయొచ్చు కదా!?
VOTE
టీవీలో ఇంట్రస్టింగ్ ప్రోగ్రామ్స్ రావట్లేందుకంటే...
మనం టీవీ 'జీరో' ఇంట్రస్ట్‌కి తీసుకున్నాం కదా?
అందుకేనేమో!
ఈ దర్శకుడు లొకేషన్ విషయంలో కాస్త
జాగ్రత్త తీసుకునేంటే బావుండేదేమో కదా?
ఒకవేళ మీరు ఇన్‌స్టాల్‌మెంట్
కట్టకపోతే... నేనీ బటన్ నొక్కుతా....
టీవీ ఆఫ్ అయిపోతుంది!
Subhani

# (అ)ప్రశాంత రావు



కంచనపల్లి ద్వారకనాథ్,
985295605

**ఆఫీసులో ఎన్నో సమస్యలు... సునాయాసంగా పరిష్కరించి ఎంతో మంచి పేరు తెచ్చుకున్న ప్రశాంతరావు రెండు వారాల క్రితం రిటైర్మెంట్ అయ్యి ఇంట్లో ప్రశాంతంగా ఉంటూ వారపత్రికలు, న్యూస్ పేపర్లు, టీవీ చూసుకుంటూ కాలం గడుపుతున్నాడు.**

**ఒక ఆహ్లాదకరమైన ఉదయం బ్రష్ చేసుకుని వచ్చి కాఫీ కోసం ఎదురు చూస్తూన్న ప్రశాంతరావు ఫోను రింగైంది.**

**ఫోను చూసుకుని ఇదేదో కొత్త నెంబర్ లా వుంది... ఇంత పొద్దున్నే ఎవరు చేస్తున్నారబ్బా... అని అనుకుంటూనే ఫోను ఎత్తాడు**

అవతల నుండీ... "హలో... హలో... హలో .. ఒరేయ్ ప్రశాంత్!" అన్నాడు .

'వీడెవడో పేరుపెట్టి, ఒరేయ్ అని పిలుస్తున్నాడు..' మనసులో అనుకుంటూండగా...

"ఏరా! అవాక్కయ్యావా? గుర్తుపట్టలేదా... ఇంకా నేనెవరో అర్థం కావడం లేదా?...నేనురా! నీ చిన్న నాటి స్నేహితుడిని...నీ హితుడిని, స్కూల్‌మెట్‌ని, నీ క్లాస్‌మెట్‌ని... బెంచిమేట్‌ని... అన్ని మెట్లైనా మనం చదువు అయ్యాక ఎన్నో మెట్లు ఎక్కి ఉద్యోగ వేటలో నేను హైదరాబాదులో స్థిరపడాను." అనగానే...

అసలు నువ్వెవరో గుర్తుకు రావడం లేదు!" అన్నాడు ప్రశాంతరావు.

"గుర్తు పట్టలేదా? నీ గొంతు అంత దరిద్రపు గొంతు క్లాసులో ఎవ్వరికి వుండదు అని అందరు అంటుండేవాళ్ళు... ఇప్పటికైనా గుర్తుకొచ్చానా! అయినా ఇన్నేళ్ళు అయింది గుర్తు రాలేదేమో నేనే చెప్తా!... చెప్పేస్తున్నా... నేనురా శైలేంద్ర!.... ఇంకా గుర్తుపట్టలేదా?" అన్నాడు.

"అమ్మయ్య బతికించావురా! గుర్తుకోచ్చావ్... ఇందాకటి నుండి ఏ రాంగ్‌నెంబర్ గాడో అనుకున్నా! ఇప్పుడేం చేస్తున్నావ్?" అనగానే...

"ఇప్పటికి దారిలోకి వచ్చావ్... నేను డాక్టర్ పనిచేస్తున్న... వెల్ సేటిల్డ్!"

"వావ్!... అయితే రెండు చేతులా బాగా సంపాదిస్తున్నావన్న మాట! అయినా నా ఫోను నెంబర్ ఎక్కడిది? ఎలా పట్టావురా?"

"అదా!... నీవు రిటైర్డ్ అయినప్పుడు నిన్ను సన్మానించినప్పుడు తీసుకున్న ఫోటో...నా ఫ్రెండ్ రంగారావు ఇంటికి వెళ్ళినప్పుడు చూపించాడు. నువ్వు మా ఫ్రెండ్ కలిసి పని చేసారని తెలంగాణ వేరైనప్పుడు ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ అయ్యి వచ్చావని చెప్పగా ఆ ఫోటో నీదేనని గుర్తుపట్టి నీ ఫోను నెంబర్ పట్టాను. అదన్న మాట కథ! మన స్కూలు రోజులు, మనం చేసిన చిలిపి పనులు అన్ని ఒక్కసారి గుర్తుకొచ్చాయనుకో..." అని గర గర నవ్వు నవ్వాడు.


"నీవు ఎలాగు రిటైర్ అయ్యావు... కాబట్టి నీ వంటరితనం పోగొట్టడానికి నీ వాట్సాప్ నెంబర్‌కి మంచి మంచివి పంపిస్తాను, అవి నీకు, మీ ఆవిడకు ఎంతో ఉపయోగపడుతాయి!"

"ఏం పంపిస్తావురా?"

"ఏమిలేదు... నేను పొద్దున్నే వాకింగ్‌కి వెళుతాను అక్కడ మా ఫ్రెండ్స్ అందరం వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకున్నాం... అందులో రిటైర్ అయ్యి ఆఫీసు పోరు తప్పినా ఇంట్లో పోరు తప్పదు కాబట్టి రకరకాల రోగాలు రావచ్చు... అందుకని మేమందరం ఎన్నోరకాల వైద్య చిట్కాలు, నొప్పులకు, షుగర్‌కు డైట్ ఎలా తీసుకోవాలి విటమిన్లు గురించి, ఎన్నో... అందరం షేర్ చేసుకుంటాం... ఇవన్ని నీకు పెడతాను ముందు ముందు నీకు పనికి రావచ్చు."

ఒక్కక్షణం ఆగి...

"అయినా ఒకడు హోమియోపతి, ఇంకొకడు అల్లోపతి, ఆయుర్వేదం, యునాని, ఇలా ఎన్నోపెడుతుంటారు అది చదివిన వాడికి ఏది వాడాలో పెద్ద కన్ఫ్యుసన్! ఒక్కొక్కసారి నాకు అర్థం కావు... అయినా షేర్ చేసుకుంటాం... దండాలు, చప్పట్లు,రకరకాల బొమ్మలు... ఎమోజిలు పెట్టకపోతే ఏడుస్తారని పెడుతుంటాం..."



మళ్ళీ... గర గర నవ్వు...

"ఇకపోతే... మీ ఆవిడకి భక్తి ఎక్కువ అని విన్నాను. అందుకని ఒకడు మా గ్రుపులో మహా భక్త రామదాసు వున్నాడు. వాడు పురాణాల విషయాలు , దేవుళ్ళ ఫోటోలు వీడియోలు, శ్లోకాలు దేవాలయాలు, వ్రతాలు, నోములు భక్తి గీతాలు పెడుతుంటాడు... అవి నీకు పెడతాను. అప్పుడు మీ ఆవిడ భక్తీ, పరిఢవిల్లి పుణ్యం మూటకట్టుకుంటుంది. ఏమంటావ్?"అన్నాడు

'నాయనా! పొద్దున్నే నాకు తగిలావ్... నీవు పంపే భక్తివన్ని చూపించానంటే ఇంటికొచ్చే పతివ్రత పేరంటాళ్ళు ఇప్పటికే నా భార్యని భక్త పుణ్యవతి అని పిలుస్తు న్నారు. ఇక మీదట నా పాలిట శక్తివతిగా మారుతుంది. మొన్ననే రిటైర్ అయ్యారు కదా ఇక మన మిద్దరం కలిసి పూజలు వ్రతాలు గుళ్ళు గోపురాలు అని మొదలు పెట్టింది!' అని మనసులో అనుకున్నాడు.

"ఆ !ఏరా!...ఏమి ఆలోచిస్తున్నావ్? ఇంత మంచి సలహాలిచ్చే ఫ్రెండ్ అంటే వీడేరా అనా? ఫీల్ అవుతున్నావా?"

'ఫీలింగా! నీ బొంద!! రిటైర్‌మెంట్ లైఫ్ హాయిగా, సరదాగా, గడపాలనుకుంటే...నీవు ఎక్కడ తగలపడ్డవురా బాబు! నీలాంటి వాడు ప్రతి ఫ్యామిలికి ఒక్కడు తగిలాడనుకో... ఫోన్లు చూసి చెడి పోతున్నారు, కళ్ళు పోతున్నాయి, ఆరోగ్యాలు చెడి పోతున్నాయి అనే వాళ్ళకి ఫోన్ల మీద విరక్తి పుడుతుంది. నీవు పంపే వాట్సాప్‌లోవి గుడా ఒక రకంగా ఫోను మీద విరక్తి కలిగిన వాళ్లకు మేలు చేస్తాయి!" అని మనసులో అనుకున్నాడు.

"ఏంట్రా! నేను మాట్లాడుతుంటే నువ్వు బాగా ఫీల్ అవుతున్నట్లు న్నావు?"

"సరేరా!ఇంతకీ నీవు ఏ డాక్టర్‌గా ఎక్కడ పని చేస్తున్నావ్?"

నేను ఇక్కడే మెంటల్ హాస్పిటల్‌లో డాక్టర్‌గా పని చేస్తున్నాను!"


మనసులో 'హమ్మయ్య! ఇప్పటికి క్లారిటి వచ్చింది' అని...

"సరేరా... నాకు అర్జంట్ పనుంది... వెళుతున్నాను!" అన్నాను.

"సరే! మళ్ళీ కాల్ చేస్తాను!..." ఫోను పెట్టేసాడు.

అర్జంటు పనిలో వున్నప్పుడు ఫోనుచేయడం నిద్రలో, భోజనం టైములో, ఆఫీసుకి పోయే టైములో ఫోన్లు చేసేవాళ్ళు... మన ఫోన్లక్కి తరచూ ఇలాంటి వాళ్ళు తగులుతుంటారు. గ్రూపులు కట్టి... అన వసరమైనవన్ని పంపుతూ ఫోనుచేసి అక్కడ వానలా...ఎండలా... అంటూ వాతావరణ వివరాలు అడగడం మన ఇళ్ళల్లో గదిలో దేవుళ్ళకు మనం రోజు దండం పెట్టుకున్నా మళ్ళీ దేవుళ్ళ ఫోటోలు వీడియోలు పెట్టి బాదుడే బాదుడు!...

ఇలాంటి అనుభవం మీకు తగిలేే ఉంటుందను కున్న వారికి ఈ కథ అంకితం!



# ఆల్ ఈజ్ వెల్



కె.వి.సుమలత
9492656255

**“మనం సంక్రాంతి షాపింగ్‌కి కొత్తగా ఓపెన్ చేసిన షాపింగ్ మాల్ కి వెళ్దామని రోజూ చెవిలో ఇల్లు కట్టుకొని పోరు పెట్టినా అసలు వినపడనట్లు ప్రవర్తిస్తున్నారు... అసలు ఏంటి మీ ఉద్దేశ్యం?... ఆ... ఏంటి చెప్పండి?” అమి తుమి తేల్చుకునే ఉద్దేశ్యంలో చీర నడుం చుట్టూ బిగించి అంది మంగభాను.**

**“ఎందుకే అక్కడకి? షాపింగ్ మాల్స్ వాళ్ళు ఆఫర్ల పేరిట డబ్బులు దండిగా లాక్కుంటారు... మనం ఎప్పుడూ వెళ్లే బట్టల షాపుకి వెళ్దాం” అన్నాడు పీనాసి అప్పారావు.**

“అలా కుదరదంటే కుదరదు... ఏది ఏమయినా మనం పండుగలో హ్యాపీగా ఉండాలంటే వాళ్ళ మాల్ కి వస్తేనే సాధ్యమవుతుందని వాళ్ళు ఇంటింటికీ కాగితాలు పంచారు. అందుకే మనం అక్కడకే వెళ్ళాలి” అంది మంగభాను.

“ఇదుగో చూడు భాను! నా దగ్గర ఉన్న బడ్జెట్ దాటితే నేను తల తాకట్టు పెట్టాల్సి వస్తుంది... నువ్వు భారీ ఎత్తులో కొనను అంటేనే నేను అక్కడకు తీసుకెళ్తాను. బాబీగాడిది ఎదిగే వయసు, వాడికి ఎక్కువ ఖరీదులో కొనకు. నీకు, బాబీ గాడికి, నాకు అయిదు వేలల్లో బట్టలు కొనాలి. అలాగని నాకు ముందు మాట ఇవ్వు!” చెయ్యి చాస్తూ అన్నాడు అప్పారావు.

“మాటే కదా దానిదేం భాగ్యం!” అని చేతిలో చెయ్యి వేసింది భాను.

పక్కనుండి “చేతిలో చెయ్యేసి చెప్పు భాను!” పాట అందుకున్నాడు అప్పారావు.

✦✦✦

ఆల్వేస్ హ్యాపీ పేరుతో కొత్తగా పెట్టిన షాపింగ్‌మాల్ కి అప్పారావు, భాను, బాబీతో కలిసి వెళ్ళారు.

భాను బండి దిగడం ఆలస్యం అప్పారావుని వదిలిపెట్టి బాబీని ఒక చేత్తో లాక్కుంటూ లోపలకు పరుగు లాంటి నడకతో వెళ్ళిపోయింది.

అప్పారావు రంగుల లైట్లతో, అద్దాలతో ధగ ధగ మెరిసిపోతున్న మాల్‌ని కళ్ళప్పగించి చూస్తూ నిలబడిపోయాడు.

కాసేపటికి భాను తన పక్కన లేదన్న స్పృహ వచ్చింది.

ఆమె కోసం వెతుక్కుంటూ లోపలకు అడుగుపెట్టాడు.

ఎదురుగా ఉన్న బొమ్మకు కట్టిన చీరను చూసి మురిసిపోతున్న మంగభాను కనిపించింది.

‘అమ్మో! అదెంత ఖరీదులో ఉందో ఏంటో’ అనుకుంటూ పరుగు లాంటి నడకతో ఆమెను చేరాడు అప్పారావు.

“భానూ! అలా చెప్పాపెట్టకుండా వచ్చేస్తే ఎక్కడని వెతకాలి?” గొణిగాడు అప్పారావు.

“ఇక్కడ కాదు అక్కడ చూద్దాం రండి!” అంటూ ముందుకు దూసుకెళ్లి అక్కడ చీరలు వెతుక్కుంటుంది భాను.

ఆమె ఏ చీర పట్టుకుంటే ఆ చీర బిల్ చూస్తూ కంగారుపడుతున్నాడు అప్పారావు.

“సర్! మీరు అదృష్టవంతులు. మేడం సెలక్షన్ చాలా బాగుంది. మంచి నాణ్యత ఎంపిక చేస్తున్నారు!” అని అక్కడి సేల్స్ గర్ల్ అంటుంటే అప్పారావుకి బీపీ పెరిగిపోతుంది.


“మేడం! 2024 లో ఈ డిజైన్ బాగా ట్రెండ్ అయిందని అందరూ అంటున్నారు. ఇది పదివేల రూపాయల చీర కానీ మీరు కట్టుకుంటే లక్ష రూపాయల చీరలా కనిపిస్తుంది, మీకు బాగా నప్పుతుంది.” అంది సేల్స్‌గర్ల్.


సేల్స్ గర్ల్ మాటలకు ఉబ్బితబ్బిబ్బయిన భాను ఆ చీర భుజం పైన వేసుకొని... అద్దం ముందు నిలబడి ఫోజులిస్తోంది.

“అబ్బే! నీకు అసలు బాగాలేదు” కంగారుగా అన్నాడు అప్పారావు.

“మేడం!... మీకు దిష్టి తగులుతుందని సర్ భయపడుతున్నారు. అందుకే అలా అంటున్నారు... మీరు ఇప్పుడు అచ్చు హీరోయిన్ అనుష్కలా ఉన్నారు” అంది సేల్స్ గర్ల్.

మంగభానుకి అద్దంలో తనకు మారుగా





అనుష్క కనిపించింది. ఇంకేముంది ఆమె కలల్లో తేలిపోతుంది... ఊగిపోతోంది.

"బాబూ! మీ అమ్మ ఈ చీరలో చాలా బాగుంది కదా?" అని అక్కడే ఉన్న బాబీని కూడా అడిగింది సేల్స్ గర్ల్.

"అవునమ్మా! ఈ చీర భలే మెరుస్తోంది" అన్నాడు బాబీ. మురిసిపోయిన భాను మళ్ళీ కలల్లో మునుగుతూ తేలుతుంది.

అప్పటికే చీర రేట్ చూసిన అప్పారావుకి భారీగా ముచ్చెమటలు పడుతున్నాయి.

"అబ్బే! అసలు బాగాలేదు భాను! ఈ అమ్మాయి నీకు అబద్ధం చెప్తుంది!" అన్నాడు అప్పారావు ముందుకూ వెనక్కీ ఊగిపోతూ.

"ఈ ఇయర్ ట్రెండ్ సర్ ఇది... మేడం మీ పక్కన అనుష్కలా కనిపిస్తుంటే మీకేగా మంచిది. నిజానికి మీరు కూడా హీరో ప్రభాస్‌లా ఉన్నారు. మీకు ప్రభాస్ వేసుకునే డ్రెస్లు థర్డ్‌ఫ్లోర్‌లో ఉన్నాయి... మేడం షాపింగ్ అయ్యాక మీరు అక్కడకు వెళ్ళండి. బాబు కోసం జూనియర్ ప్రభాస్ డ్రెస్లు సెకండ్ ఫ్లోర్లో ఉన్నాయి. మీరు అవన్నీ తీసుకోండి సర్!" అంది సేల్స్ గర్ల్.


"అవును అది కూడా నిజమే! నేను ఈ చీర కట్టుకున్నప్పుడు మీరు కూడా నా పక్కన ప్రభాస్‌లా ఉండాలి కదా?... థర్డ్‌ఫ్లోర్‌కి వెళ్దాం పదండి" అంది భాను భుజం మీద నుండి చీర తీయకుండా.

"అమ్మో! నువ్వు ఈ చీర తీసుకోవొద్దే! నీకు దండం పెడతాను. నాకు ఏ బట్టలూ వద్దు, నేను ఎక్కడకూ రాను..." అని అక్కడే తల పట్టుకొని కూర్చున్నాడు అప్పారావు.

"మీరు తీసుకోవద్దుగానీ, ఇక్కడే కూర్చుని అందరినీ చూడండి... నేను బాబీగాడు వెళ్ళి తీసుకుంటాము!" అని అప్పారావు దగ్గరనుండి పర్స్ తీసుకొని ఎంచక్కా కిడ్స్ ఫ్లోర్ వైపు బాబీ చెయ్యి పట్టుకొని వెళ్ళిపోయింది మంగ భాను.

"షాపింగ్‌కి రావడం వరకే ఆడవారికి మగవారి అనుమతి కావాలి. తీరా వచ్చాక వారికి ఎటువంటి అదుపు ఉండదు. సేమ్ పించ్ బ్రో!" అన్నాడు అప్పటి వరకు వీళ్ళను గమనిస్తున్న సేల్స్ మాన్ చిప్పారావు.

"అలా వదిలేస్తే గాలిపటాలలాగా ఆకాశంలోకి ఎగిరిపోతారు. నేను వెళ్ళి ఆపాలి బ్రో!" నెత్తి కొట్టుకుంటూ అన్నాడు అప్పారావు.



"అదంతా మీ పిచ్చి భ్రమ బ్రో! ఒకప్పుడు నేనే ఈ షాపు ఓనర్ని. మా ఆవిడ తరచుగా పుట్టింటివారిని తీసుకొచ్చి షాపు మీద దాడి చేయడంతో అప్పులపాలయ్యాను. షాపు మీద భ్రాంతితో వదలకుండా ఇందులోనే పనిచేస్తున్నాను. భార్యలనే గాలిపటాలను ఎగరకుండా కట్టే తాడు మన చేతిలో ఎప్పటికీ ఉండదు బ్రో!" వేదాంతిలా అన్నాడు చిప్పారావు.

అప్పారావు అయోమయంలో పడిపోయి పిచ్చిచూపులు చూస్తున్నాడు.




**గతంలో...** అమెరికాలో స్థిరపడ్డా బ్రహ్మచారి చందు. అందరికీలానే చందు పెళ్ళికోసం తండ్రి తన మరదలు సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకోమని నెత్తినోరు కొట్టుకుని మొత్తుకుంటుంటాడు. తనకి మరదలు మీద ఏ ఫీలింగ్ లేదని చందు తెగించి చెప్పేస్తాడు. మూడు నెలల్లో యోగ్యురాలైన అమ్మాయిని తెచ్చి మా ముందు పెట్టు... లేదంటే చచ్చిపోతానని బెదిరిస్తూ తండ్రి ఈమెయిల్ పంపిస్తాడు. అమ్మాయిని వెతికే పనిలో ఉంటాడు చందు. మెక్సికన్ కిడ్నాపర్ ఓలేకి, సుబ్బు ఒక ఫోటో ఇచ్చి, ఆ అమ్మాయిని కిడ్నాప్ చేయమని చెప్తాడు. ఆ అమ్మాయి తెలంగాణ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో 6వ అయిటమ్ చేసే అమ్మాయని చెప్తాడు. ఆ కార్యక్రమం అయిపోయాక సౌమ్యను కిడ్నాప్ చేసి, ఒక గదిలో బంధిస్తాడు ఓలే!.... సౌమ్య ఓలేని నానా విధాలుగా ఇబ్బంది పెడుతుంటుంది. ఆమె పెట్టే ఇబ్బందులు భరించలేక ఆమెని విడుదల చేస్తాడు ఓలె.

ఇందునాన్న తెలంగాణ అబ్బాయికే యిచ్చి ఇందు పెళ్ళి చేయాలను కుంటుంటాడు. ఇందు, ఆంధ్ర కుర్రాడు చందుని ఇష్టపడుతుంది. అయితే గతంలో వజ్రాల హారం దొంగతనానికి ఇందూ చందూల పెళ్ళికి కారణమవుతుంది. **ఇప్పుడు...**

**వీసాచారి షాకౌతూ... "నేను ఇవ్వను! మీరు నన్ను ఏమైనా చేస్తే అరుస్తాను!" అన్నాడు.**

**ఆ నలుగురిలో ఒకడు, వీసాచారి చేతిలో ఉన్న బర్గర్‌ను వీసాచారి నోటిలో పూర్తిగా కుక్కి, కారు, వెనక సీట్‌లోకి తోసి తాను ఎక్కాడు.**

**మిగతావాళ్ళు వీసాచారి కారెక్కి, నగ కోసం వెతికారు. నగ దొరకలేదు.**

**"ఏయ్! నగ ఏది?"**

**"అబ్బే! నేను ఏ నగా తేలేదే!" అన్నాడు.**

**"ఏయ్! మేం చూసాము! మర్యాదగా ఇవ్వు!"అన్నారు వాళ్ళు.**

**వీసాచారి వాళ్ళను తేరిపారా చూసాడు.**

**ఇక వాళ్ళు ఆలస్యం చేయలేదు. కారు డోర్స్, కిటికీ అద్దాలు వేసేసారు.**

**వీసాచారిని చపాతీ పిండి నలిపినట్లు నలుపుతూ, పిడికిళ్ళు బిగించి... మర రోకళ్లతో చపాతీ పిండిని గుద్దితే ఎలా ఉంటుందో...అలా కుమ్మేసారు.**

పిచ్చకొట్టుడు కొట్టి, చేయిని భారత్ వైపు, కాలిని మెక్సికో వైపు వంచి...ఆపకుండా కొట్టసాగారు.

"ఒరేయ్! ఆపండ్రా...మీ అమ్మాకడుపులు మాడ! ఒక్కొక్కడు బకాసుర, హిడింబాసుర, చాణూర, ముష్టికుల సైజుల్లో ఉన్నారు కదరా! మనిషి చంపాలంటే, మీకు తుపాకులు కూడా అవసరం లేదురా!... ఏదైనా పంజాబీ దాబా చూసుకొని, అక్కడ చేరండ్రా... చపాతీ పిండి తడిపే ఉద్యోగాలు సులభంగా వస్తాయి మీకు! చపాతీ పిండిని నలిపినట్లు నలిపేస్తున్నారు కదరా! రేయ్...ఆపండి!... బతికుంటే బర్గర్ తినొచ్చు! బతుకుజీవుడా!" అనుకుంటూ...

తన డ్రాయర్‌లో దాచుకున్న నగను తీసి,

వారికి ఇచ్చాడు వీసాచారి.

వాళ్ళు కదులుతుంటే... అడిగాడు–

"ఆ సుబ్బు పీనుగే మిమ్మల్ని పంపాడా? అదొక్కటి చెప్పి వెళ్ళిపోండి!" అన్నాడు... సొట్ట పోయిన మొహంతో, లొట్టపోయిన కన్నుతో చూస్తూ.

"సుబ్బు? సుబ్బు ఎవరు?..." అడిగారు వాళ్ళు, తమ కారు ఎక్కుతూ.

వీసాచారి షాక్ అవుతూ– "ఆ సుబ్బుగాడు ఎక్కడ చచ్చాడో!... ఒరేయ్! నా ఆశల మీద నీళ్లు చల్లి... నా మనుమళ్ళ మనుమళ్ళ మను మళ్ల ఆశల మీద నెళ్ళు చల్లి మరీ ఆ నగను ఎత్తుకుపోతున్నారేంట్రా! కుయ్యో... మొర్రో... ఒరేయ్ ఆ నగను అమ్మి తరతరాలు తిని కూర్చుందాం అనుకుంటున్నారా? మీకు తిన్న తిండి అరగదురా!... మీకు గ్యాస్ ట్రబుల్ వస్తుందిరా... పది మందిలోనూ ఆ గ్యాస్ కంట్రోల్ చేసుకోలేక... మీరు నరకం అనుభవి స్తారురా! ఇదేరా నా శాపం!" అని మూలు గుతూ, శాపనార్థాలు పెట్టసాడు వీసాచారి.

మంత్రాలకు చింతకాయలు రాలతాయో లేదో తెలియదు కానీ, పాపుల శాపాలకు పెను గాలిలో కూడా, చింతచెట్టు మీదున్న పండు టాకు కూడా రాలదు!


✦✦✦


అమెరికా రౌడీలు నగను తీసుకెళ్ళి, కిశోరీ లాల్‌కు ఇచ్చారు.

"వార్నీ! ఇది మేము చేసిన డూప్లికేట్ నగే!" అన్నాడు అతని తండ్రి మోతీలాల్.

✦✦✦






సుబ్బు కారు, రెండు రోజులు మధ్యమధ్యలో విశ్రాంతి తీసుకుంటూ ఆగి ఆగి లాస్ వేగాస్ లోకి ప్రవేశించింది.

సుబ్బు, ఓ పెద్ద భవనం ముందు ఆగాడు.

ఆ భవనం ముందుకున్న దుక్క లాంటి ఇద్దరు సెక్యూరిటీ గార్డులు, అతడిని లోపలికి తీసుకెళ్లారు.

ఆ భవనంలోని ఓ గదిలో ఉన్న... భారీ టేబుల్ దగ్గర, తల మీద మెక్సికన్ హ్యాట్‌తో, మెడలో బంగారు గొలుసులతో, నోట్లో భారీ సిగార్‌తో, నల్లనికోటు, ఎర్రని టైతో, ఆరున్నర అడుగులున్న కండలవీరుడు... డేనియెల్ కూర్చొని ఉన్నాడు.

"వ్వాట్ సుబ్బు? తెచ్చావా?..." అడిగాడు డేనియెల్.

సుబ్బు తలూపి, తన బ్యాగులో నుండి, నగను తీసి టేబుల్ మీద పెట్టాడు.

డేనియల్, ఆ నగను తీసి, తన పక్కనే ఉన్న ఓ అమ్మాయికి అందించాడు.


ఆమె తన దగ్గరున్న గీటు రాళ్ళు, భూత ద్దాలు తీసుకొని చెక్ చేస్తోంది.

"నాకు డబ్బు అర్జంటుగా కావాలి!... డాలర్స్‌లో వద్దు. రూపాయలలో కావాలి. అదీ ఇండియాలో!" అన్నాడు సుబ్బు.

"తప్పకుండా! అన్నట్టు... నువ్వు మా దగ్గర తీసుకున్న రెండు కోట్లు మైనస్ చేసి మరీ ఇస్తాను. తెలుసు కదా!" అన్నాడు డేనియల్.

"తెలుసు...తెలుసు!" అన్నాడు సుబ్బు.

ఆమె చెక్ చేసి, డేనియల్ వైపు చూసి తల అడ్డంగా ఊపింది.




డేనియెల్, బెల్ ఐదుసార్లు నొక్కాడు. ఐదు మంది కండల వీరులు లోపలికి వచ్చారు.

సుబ్బును అమాంతం లేపి, టేబుల్ మీద పడుకోబెట్టి, డిషుం...డిషుం అని కాలిబంతి ఆట... ఆ తర్వాత ఆ గదిలో నేల మీద ఈడ్చి, కాలి బంతి ఆట ఆడి...కొబ్బరి పీచు తీసి నట్లు... ఉతికి ఆరేసారు.

సుబ్బు లబోదిబో అంటూ, వీసాచారికి ఫోన్ చేసాడు.

హాస్పటల్‌లో ఉన్న వీసాచారి–

"అదేంటి సుబ్బుగారు!... మీరు నాకసలు రెండు రోజుల నుండి ఫోనే చేయలేదు!..." అన్నాడు అమాయకత్వం నటిస్తూ.

"ఆ నగ తీసుకున్నారా?" అన్నాడు సుబ్బు మూలుగుతూ.

"అదేమిటి?... ఏదో మూలుగుడు వినిపి స్తోంది?"

"అదా!...అదీ నేను కాదు. ఇక్కడ గూని గుర్రం ఒకటి బరువు ఎక్కువై మూలుగుతోంది. నగ సంగతి?" అడిగాడు సుబ్బు.

ఈలోపు, డేనియల్ మనుషులు సుబ్బుకు రెండో కోటింగ్ మొదలుపెట్టి... తన్ని తరిమే సారు.

'సుబ్బుకు కూడా ఎక్కడో కోటింగ్ జరుగు తున్నట్టు ఉంది! అందుకే అన్నారు పెద్దలు... కష్టపడి బతకండిరా అని! మనం వింటేగా! కాలో చెయ్యో విరిగితే తప్ప తత్వం బోధ పడదు!' అనుకున్నాడు వీసాచారి!

బాగా తన్నులు తిని ఆ చీకటి సందులో

పడి ఉన్న, సుబ్బు అనే వ్యక్తిని లాస్ వెగాస్‌లో పోలీసులు రక్షించి ఆసుపత్రిలో చేర్చారని, అసలు వాడిని ఎవరు కొట్టారో... ఎందుకు కొట్టారో... కూపీలాగే పనిలో పోలీసులు ఉన్నారని... ఓ వార్త న్యూస్ పేపర్ లో చదివి,

"హమ్మయ్య! తిక్క కుదిరింది వెధవకు!" అనుకుంది ఇందు!

✦✦✦

హైదరాబాద్‌లో ఇందూ చందుల పెళ్ళి వైభవోపేతంగా జరుగుతోంది.

తెలంగాణా నుండి, ఆంధ్రా నుండి, అమెరికా నుండి అతిథులు విచ్చేసారు.

అన్నట్టు వధూవరులతో వారి తల్లిదండ్రులు, రామం–రచన గ్రూప్ ఫోటో దిగుతున్నారు.

అదిగో...పెళ్ళికూతురు మెడలో కనిపిస్తున్న 56 వజ్రాలున్న నగను చూసారా?... తళతళా మెరుస్తోంది కదూ! అది డూప్లికేటు నగండీ బాబూ! ఒరిజినల్ నగను, రెండు కుటుంబాలూ కలిసి భారత ప్రభుత్వానికి అప్పగించాయి. ప్రభుత్వం మెచ్చుకొని... పది కోట్ల రూపాయల బహుమతిని ఆ కుటుంబాలకు ఇచ్చాయి! అయితే... ఇందు–చందు, రామం–రచన లు చెరీ సగం ఆ డబ్బు పంచుకున్నారు!

హాస్యానందం పాఠకోత్తములారా! వాళ్ళ డబ్బు గోల మనకెందుకుగానీ, మనకూ వారి పెళ్ళికి ఆహ్వానం అందింది.

వధూవరులను ఆశీర్వదించి, బార్–కోడ్ ద్వారా మొబైల్ యాపుల ద్వారా చదివింపులు చదివించి, విందు భోజనం చేసి మరీ వెళదాం! పదండి మరి!


అందరికీ ఇవి ప్రాప్తించుగాక!


హాస్యం!ఆరోగ్యం!ఆనందం!శాంతి!


**(అయిపోయింది)**



# వినాయక చవితి నవ్వులు



# నా సబ్బు రహస్యం



డా. బెల్లంకొండ నాగేశ్వరరావు,
9884429899

**కథలోనికి వెళ్ళేముందు మిమ్మల్ని ఒకమాట అడుగుతాను... మీరు స్నానానికి వాడే సబ్బు మీకు ఎన్నిరోజులు వస్తుంది? మహా అయితే పదిహేను రోజులు వస్తుంది... నా స్నానం సబ్బు నేటికి ఆరు నెలలు దాటింది.**

**ఎలా అంటారా? చెపుతానండి అలా తొందరపడితే ఎలా? ఈ రహస్యం తెలుసుకోవాలంటే ఈ కథలోకి వెళ్ళవలసిందే...**

పినాకినిలో ప్రయాణం చేసి ఇల్లు చేరేసరికి... మూడు గంటలు దాటింది.

బెడ్‌రూమ్‌లో బ్యాగ్ పెట్టి– “ఏమోయ్!... నా సబ్బు వేయి బాత్ రూమ్‌లో!” అన్నాను లుంగీచుట్టుకుంటూ.

వెంటనే మా హోంశాఖ సింతాల్ రెడ్ ఒకటి నా సబ్బు పెట్టెలో వేసి దానికి నా మనవరాలుకు వాడే హిమాలయ బేబి సబ్బు ముక్క అంటించి ఉంది.

అంటే అంటించిన నా మనవరాలి సబ్బు ముక్క వైపునే రుద్దుకుని స్నానం చేయమని అర్థం.

ఏ మాటకి ఆమాటే చెప్పుకోవాలి ఇంటి విషయాలలో హోంశాఖ ఆర్డరు అమలు జరిపితే ఎటువంటి బాధలు, వంటింట్లో నుండి ఎటువంటి శబ్దాలు ఉండవు. ఇల్లు ప్రశాంతంగా ఉంటుంది.

అసలు ఈ తప్పునాదే ఇంట్లో స్నానం సబ్బుముక్కలు, మరుగుదొడ్లోనో, భోజనాల బల్లవద్ద షింక్ వద్దో ఉంచేవాళ్ళు. నేను ఎప్పుడైతే పై రెండు చోట్లా లిక్విడ్ సోపు బాటిల్స్ తెచ్చి పెట్టడం వలన... ఈ మిగిలిన సబ్బు ముక్కలన్ని నా సబ్బుకు అంటించడం ప్రారంభం అయినది.

స్వయంకృతాపరాధం... చేసుకున్నవారికి చేసుకున్నంత మహదేవా అన్నారు పెద్దలు. నేనేమంటానంటే ఈ విషయంలో రుద్దుకున్న వారికి రుద్దుకున్నంత గురుదేవా అంటాను.

వారం రోజులు నా మనవరాలి సబ్బుముక్క అంటించిన వైపు వాడి... ఆ ముక్కను అరగదీసాను. మరునాడు స్నానానికి వెళ్ళే సరికి నా సబ్బుకు పియర్స్ సబ్బుముక్క అంటించి ఉంది. అనుభవజ్ఞుడిని కనుక మారు మాట్లాడక ఆ సబ్బు ముక్కను మరో ఐదురోజులు అరగదీసి హమ్మయ్య నాకు ఇష్టమైన నాసబ్బుతో రేపు స్నానం చేయ్యొచ్చు అనుకున్నా.



మరుదినం స్నానానికి వెళ్ళి చూద్దునుకదా... నా మనవడు స్నానానికి వాడే మైసూర్ సాండల్ సబ్బు పెద్దముక్క... నా సబ్బుకు అంటించి ఉంది. దాదాపుగా పన్నెండు రోజులు పట్టింది ఆ సబ్బు ముక్క అరగదీయడానికి.

బ్రతికిపోయానురా దేవుడా అనుకుంటూ, మరుదినం స్నానాల గదిలో నా సబ్బుకు... చంద్రిక సబ్బు పెద్దముక్క అంటించబడి ఉంది. అది మాహోంశాఖ వాడేది. ఇవి కాకుండా మా ఇంట్లో బంధువులులకు ప్రత్యేకంగా సంతూరు సబ్బు పెడతాం. అరుదుగా ఆ సబ్బు ముక్కకూడా నా సబ్బుకు అంటుకునేది.

ఒక్కో పర్యాయం నా సబ్బుకు రెండు పక్కలా రెండు రకాల సబ్బు ముక్కలు అంటించడం కూడా జరుగుతుంది. ఈ విషయంలో నేను నిమిత్తమాత్రుడను. అంటించేది... వాసన చూసేది మా హోంశాఖ వారే.

తెగించి తిరుగుబాటు ధ్వజం చేతబూని ధైర్యంచేసి భోజనాల బల్లదగ్గర–

"ఏమోయ్! ఎప్పుడూ... మీరంతా వాడగా మిగిలిన సబ్బుముక్కలేనా నాకు గతి... నా సబ్బుతో నేనెప్పుడు స్నానం చేయాలి?" అన్నాను.

పుచ్చపువ్వు లాంటి నవ్వు ఒకటి నాకు విసిరిన మా హోంశాఖ–

"చాల్లెండి సంబడం! మీరు చాలా అదృష్టవంతులు! కొడుకు, కోడలు, ఇద్దరు మనవళ్ళు కూడా ఉండి ఉంటే మీకు ఏడాదికి ఒక సబ్బే సరిపోయేది!" అన్నది.


నిజమే ఆ ప్రమాదం కూడా ఉండేదేమో! ఇదండి నా సబ్బుకథ !


లోకంలో ఇంటింటా ఈ సబ్బుముక్కల అంటింపు జరగాలని, మీరు కూడా వారానికి ఒక సబ్బు గబ్బు (వాసన) తో ఉండాలని అలా మీ అందరికి నేను గుర్తుకువచ్చి మీరంతా నాకు అక్షంతలు వేయాలి అన్నదే నా చివరి కోరిక. ఉంటానండి... ఈ రోజు ఎవరి సబ్బు ముక్క నా సబ్బుకు అంటించారో చూసుకోవాలి... మరి సెలవు.

గమనిక: ఈ సబ్బుకథకు ప్రేరణ ఇచ్చిన నటుడు చిరంజీవి గారికి ధన్యవాదాలు.

# వినాయక చవితి నవ్వులు



# పదానందం 14



కూర్పు: **పోపూరి విశ్వనాథ్, 9133197111**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | ■ | 3 | | 4 |
| | ■ | ■ | 5 | | | ■ | |
| 6 | | 7 | | ■ | ■ | 8 | |
| | ■ | | ■ | 9 | ■ | ■ | |
| 10 | 11 | | ■ | 12 | | 13 | ■ |
| ■ | | ■ | ■ | | ■ | 14 | |
| 15 | | | | | ■ | | ■ |
| ■ | | ■ | ■ | 16 | | | |

**ఆధారాలు:**

**అడ్డం:**

1. అల్పపీడనం కారణంగా కడలిలో ఏర్పడే తీవ్రమైన సుడిగాలి (4)
3. అంగీకారం (3)
5. ప్రశంసాపూర్వక ఆశ్చర్యార్థకం (3)
6. ప్రథమావిభక్తి (4)
8. ఇది ఊదటమంటే దండోరావేసినట్లు అందరికీ చెప్పడం (2)
10. సతీసావిత్రి ఈయనమీద గెలిచింది (3)
12. తిరగబడ్డ బంగారం (3)
14. అటునుంచి ఊరే ద్రవం (2)
15. చివరిలో జరిగినవింత (పత్రికాభాషలో) (5)
16. అటునుంచి వంపు (4)

**నిలువు**

1. అతిగా మాట్లాడేవ్యక్తిని ఇలా అనడం రివాజు (5)
2. గొప్పలు, బడాయిమాటలు (3)
3. మూడు అడ్డానికి ఇలా అంటారు (2)
4. దురుద్దేశపు మెలిక (4)
7. వ్యవధి సరిగాలేదు (3)
9. ఎక్కువగా వేచి ఉంటే ఇలా అంటారు (5)
11. వృద్ధుడు/వృద్ధురాలు (4)
13. పళ్ళు ఇలా కొరుకుతారట (4)

సమాధానం వచ్చే సంచికలో...

**గత సంచిక సమాధానం**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 రే | లం | 2 గి | ■ | 3 సో | గ్గా | 4 డు | ■ |
| చీ | ■ | ల్లి | ■ | మ | ■ | 5 జో | 6 ల |
| 7 క | టి | క | దా | రి | ద్ర్యం | ■ | క్క |
| టి | ■ | జ్జా | ■ | పో | ■ | ■ | చి |
| ■ | 8 రు | లు | 9 పె | తు | ■ | 10 ఇ | ట్లు |
| 11 ప | ద్ర | ■ | ట | ■ | 12 క | ల్ల | ■ |
| ■ | కు | ■ | 13 కా | న | ■ | 14 రి | త్త |
| ■ | 15 కా | పు | రం | ■ | 16 పొం | కం | ■ |


ఇంటిల్లిపాదినీ నవ్వించే పని పెట్టుకున్న
ఏకైక తెలుగు హాస్య మాస పత్రిక
హాస్యానందం
మనోవికాసానికి మందు
ఆనందం!...
హాస్యానందంతోనే
ఇది సాధ్యం!
చందాదారులుగా చేరండి.



Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

# PRIYANKA PANDA
DESIGNER STUDIO








**One stop shop for your designer wear**


- Women
- Men
- Kids

## Designing & Stitching

Call: +919959222411.
email: labelpriyankapanda@gmail.com

Hasyanandam September-2024. RNI No. APTEL 08387/01/1/2003-TC

అందరికీ వినాయక చవితి
శుభాకాంక్షలు



చవకబారు వస్తువులు విలువైనవి
కావు...
విలువైన వస్తువులు చవకగా
ఉండవు!!

Jaquar

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street,
Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548